నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 22-12-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 105 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

అహంబ్రహ్మాస్మి
మేమే జన దేవుళ్ళం
మూడడుగులు.

కొత్త అంగడి
అవయవాల సంత
విజ్ఞాన జ్యోతి.

అంతర్వాణి
మేధను బట్టి బాణి
దారులు వేరు.

ఇజాల అద్దం
సిద్ధాంతాల ముక్కలు
ఓటమి ఖాయం.

పేదల కథ
విశ్వం పుట్టుక కథ
ఏడుతరాలు

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాయి

పుస్తకాల ద్వారా మనం
తెలుసుకుంటాం మహత్తును
ఆలోచన తెలివి పెరిగి
దర్శిస్తాం భవిష్యత్తును !

బుద్ధి పెరుగును, పీల్వండి
గుండెనిండా గుడ్ ఎయిర్ !
జ్ఞానమార్గం పొందండి
హైదరాబాద్ 'బుక్ ఫెయిర్' !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

హైదరాబాద్ డిసెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్):మాతృదేవోభవ సత్సంగ్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని గన్ ఫౌండ్రీ అబిడ్స్ లోని సూర్యలోక కాంప్లెక్స్ లోని పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ కాన్ఫరెన్స్ హాల్ లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కే బి శ్రీధర్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి మూలింటి మారెప్ప మైనార్టీ విభాగం జాతీయ అధ్యక్షులు రెవరెండ్ ఆర్చ్ బిషప్ డాక్టర్ పి పి దాసన్న అడ్వైజర్ దయాసంద్ బహుజన ఫ్రంట్ చైర్మన్ నారగోని పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బాలకృష్ణ సామాజిక తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షులు కిరణ్ గారు ఐపీసీ ఉపాధ్యక్షుడు దశరథం సోషల్ ఆక్టివిస్ట్ కుమారి చిత్ర మాతృదేవోభవ సత్సంగ్ అడ్వైజర్ విజయ దేవి వాసుదేవరావు జనరల్ సెక్రెటరీ తెలంగాణ స్టేట్ ఐపిసి తుపాకుల సమత సెక్రెటరీ ఐపిసి శ్రీనివాస్ జనరల్ సెక్రెటరీ గ్రేటర్ హైదరాబాద్ నవీన్ అధ్యక్షులు యువజన విభాగం గ్రేటర్ హైదరాబాద్ మహిళా విభాగం మహిళా విభాగం నాయకులు అరుణ రెడ్డి వాణి జిఏ నేతాజీ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా బిషప్ దాసన్న గారు మాజీ మంత్రి మారెప్ప గారు మాట్లాడుతూ కుల మత ప్రాంతాలకు అతీతంగా మాతృదేవోభవ సంస్థ సెమి క్రిస్టమస్ వేడుకలు చేయడం హర్షనీయమని మీ పొరుగు వారిని ప్రేమించు అన్న ఏసుక్రీస్తు సూక్తిని ప్రచారం చేయాల్సిందిగా అప్పుడు ప్రపంచమంతా సుఖశాంతులతో జీవిస్తారని తెలిపారు ఈ సందర్భంగా క్రిస్టమస్ కేక్ కట్ చేసి భక్తి సంగీత కార్యక్రమం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తల్లీబిడ్డల ఆరోగ్యం కోసమే కేసీఆర్ పౌష్టికాహారం కిట్.. విప్ బాల్క సుమన్

హైదరాబాద్ డిసెంబర్ 21:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గర్భిణీ స్త్రీలలో రక్తహీనత తగ్గించడంతో పాటు పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ పౌష్టికాహార కిట్ పథకాన్ని ప్రారంభించినట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్, చెన్నూరు శాసనసభ్యులు బాల్క సుమన్ పేర్కొన్నారు. బుధవారం ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వ దవాఖానాలో కేసీఆర్ పౌష్టికాహారం కిట్ పథకాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ? ఆసిఫాబాద్ జిల్లాలో తొలి విడతలో భాగంలో జిల్లాలోని 4014 మంది గర్భిణులకు కిట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మీ, శాసనసభ్యులు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప, ఎమ్మెల్సీ దండే విఠల్, కలెక్టర్ రాహుల్ రాజ్, అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్ప, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్వభాషను రక్షించుకుందాం! స్వాభిమానం పెంచుకుందాం!!

కృష్ణాజిల్లా రచయితల సంఘం
ఉత్తర అమెరికా తెలుగు సంఘం TANA
తానా ప్రపంచ సాహిత్య వేదిక
సిలికానాంధ్ర
సిద్ధార్థ అకాడెమీ, విజయవాడ
సౌజన్యంతో

ప్రపంచ తెలుగు రచయితల సంఘం
ఆధ్వర్యంలో

5వ ప్రపంచ
తెలుగు రచయితల మహాసభలు
2022 డిసెంబరు 23, 24 శుక్ర, శని వారాలలో
రాజరాజనరేంద్ర సభాప్రాంగణం
పి.బి.సిద్ధార్థ ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం, సిద్ధార్థ నగర్,
మొగల్రాజపురం, విజయవాడ

ఆహ్వానం

స్వభాషను రక్షించుకుందాం! స్వాభిమానం పెంచుకుందాం!!

5వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు

రాజరాజనరేంద్ర సభాప్రాంగణం

|| ఆదికవి నన్నయ వేదిక ||

కార్యక్రమం

23 డిసెంబర్ 2022 శుక్రవారం ఉదయం 10 గంటలకు

ప్రారంభ పథ

మహాసభల ప్రారంభకులు, ముఖ్య అతిథి
గౌ॥ శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు
భారత మాజీ ఉపరాష్ట్రపతి

సభాధ్యక్షులు
డా॥ మండలి బుద్ధప్రసాద్
గౌరవాధ్యక్షుడు, ప్రపంచ తెలుగు రచయితల సంఘం

గౌరవ అతిథి
డా॥ కె వి రమణాచారి, IAS (విశ్రాంత),
గౌరవ సలహాదారు, తెలంగాణా రాష్ట్రప్రభుత్వం

ఆత్మీయ అతిథులు
ఆచార్య కొలకలూరి ఇనాక్, పద్మశ్రీ, సరస్వతీ సమ్మాన్ పురస్కారాల గ్రహీత
ఆచార్య డేనియల్ నెగర్స్, తెలుగు ఆచార్యులు, ఫ్రాన్స్
శ్రీ ఆంజయ్య చౌదరి లావు, అధ్యక్షులు, TANA, అమెరికా
డా॥ ప్రసాద్ తోటకూర, అధ్యక్షులు, తానా ప్రపంచ సాహిత్య వేదిక, అమెరికా
శ్రీ కూచిభొట్ల ఆనంద్, వ్యవస్థాపకులు, సిలికానాంధ్ర, అమెరికా
డా॥ చదలవాడ నాగేశ్వరరావు, అధ్యక్షులు, సిద్ధార్థ అకాడెమీ, విజయవాడ
శ్రీమతి రాధిక మంగిపూడి, సింగపూర్
డా॥ శ్రీదేవి శ్రీకాంత్, బోట్సువానా

కాటీ మీటల కాట ఆవిష్కరణ మఱియు "రాజరాజ నరేంద్ర" గ్రంథావిష్కరణ

స్వాగత ప్రసంగం : శ్రీ గుత్తికొండ సుబ్బారావు
లక్ష్య ప్రస్తావన : డా॥ జి. వి. పూర్ణచందు

చరిత్రలో నేటినిజం

కలం మదిలో సజీవమై మలచెద
పద్మగురి పాటలకు ప్రోత్సహించిన
బిడి ఉండ్రాపెలనొంబెట
సదయుండు "తాతినేని చలపతిరావు"నే !!

(డిసెంబర్ 22 తాతినేని చలపతిరావు జనసం..)

–రాధశ్రీ
సెల్:9494481210

గర్భిణులకు వరం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ : మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

ఆదిలాబాద్, డిసెంబర్ 2గర్భిణిల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపాలను నియంత్రించేందుకు తెలంగాణ ప్రభుత్వం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టిందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూట్రిషన్ కిట్లు గర్భిణులకు వరం లాంటిదని పేర్కొన్నారు.

బిడ్డ సంరక్షణ కోసం ఇప్పటికే కేసీఆర్ కిట్ పథకం అమలు చేస్తున్న ప్రభుత్వం, తల్లి సంరక్షణ కోసం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకం ప్రవేశపెట్టిందని తెలిపారు.రాష్ట్రంలో అత్యధికంగా రక్త హీనత నమోద వుతున్న తొమ్మిది జిల్లాలో ఆదిలాబాద్ జిల్లా ఒకటని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండున్నర లక్షల కిట్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని, దీని కోసం ప్రభుత్వం రూ. 50 కోట్లు ఖర్చు చేస్తున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, కలెక్టర్ సిక్తా పట్నాయక్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురి సజీవదహనం వెనుక వీడిన మిస్టరీ..!

–పక్కా పథకం ప్రకారం ఇంటిని పెట్రోల్ పోసి తగులబెట్టారు

మంచిర్యాల డిసెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);మంచిర్యాల జిల్లా గుడిపెల్లిలో శుక్రవారం రాత్రి ఇద్దరు చిన్నారులు సహా ఆరుగురు సజీవ దహనమైన ఘటన తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. పక్కా పథకం ప్రకారం ఇంటిని పెట్రోల్ పోసి తగలెబట్టడంతోనే ఆ ఇంట్లోని వారంతా సహజీవనం అయ్యారని పోలీసులు దర్యాప్తులో తేలడం అందరినీ విస్మయానికి గురిచేసింది. ఈ కేసు సంబంధం ఉన్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను రామగుండం సీపీ తాజాగా వెల్లడించారు.సింగరేణి ఉద్యోగి శాంతయ్య.. సజ్జన భార్యభర్తలు. వీరిద్దరి ఒక కుమార్తె ఉంది. అయితే ఇటీవల శాంతయ్య గుడిపెల్లికి చెందిన పద్మ అనే మహిళతో అదే గ్రామంలో సహజీవనం చేస్తున్నాడు. తన జీతభత్యాలను ఆమెకే ఇస్తానని తన భార్యతో తరుచూ గొడవకు దిగేవాడు. ఈ క్రమంలోనే సృజనకు డాక్యుమెంట్ రైటర్ లక్ష్మణ్ తో 2010లో పరిచయం ఏర్పడింది.అతడి వద్ద నుంచి సృజన 4 లక్షల అప్పు తీసుకుంది. అప్పు వసూలు చేసే క్రమంలో వీరిద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. అయితే తన భర్త వేరే మహిళలతో సహజీవనం చేస్తూ తనను పట్టించుకోకపోవడంతో.. ఆస్తిని సైతం ఆమెకు ఇచ్చే ప్రయత్నం చేస్తుండటంతో సృజన రగిలిపోయింది. ఈ నేపథ్యంలోనే తన భర్తను హతమార్చాలని నిర్ణయించుకుంది.ఇందుకోసం తన ప్రియుడు లక్ష్మణ్ ను ఉసిగొల్పింది. తన భర్తను హత్య చేయిస్తే తన కూతురి పేరిట ఉట్నూరులో ఉన్న 1.50కోట్ల విలువ చేసే భూమిని రాసిస్తానని అతడికి ఆశ చూపించింది. ఈక్రమంలోనే లక్ష్మణ్ లక్కెట్టి పేటలో పందుల వ్యాపారం చేసే రమేష్ ను సంప్రదించాడు. శాంతయ్యను హత్య చేస్తే 4 లక్షలు ఇస్తానని ఆశ చూపించాడు. ఇందులో భాగంగా మహేష్ అనే వ్యక్తి వద్ద నుంచి బోలోరో వాహనం కొని ఇచ్చాడు.అలాగే గుడిపల్లిలో శ్రీను అనే వ్యక్తి ద్వారా సమ్మయ్య అనే వ్యక్తిని సంప్రదించారు. శాంతయ్య.. పద్మలకు సంబంధించిన ప్రతీ సమాచారాన్ని చెబితే 1.50 లక్షలు ఇస్తామని డీల్ కుదుర్చుకున్నారు. అతడిచ్చిన సమాచారం మేరకు నెల కిందట శాంతయ్య.. పద్మను గుడిపెల్లిలో బోలోరో వాహనం ఢీకొట్టించే ప్రయత్నం చేశారు. అయితే అదుపుతప్పి వారే ఓ కందకంలో పడిపోయారు.ఆ తర్వాత పద్మ.. శాంతయ్యలు మంచిర్యాల ఆస్పత్రికి ఆటోలో వస్తుండగా బోలోరోతో ఢీకొట్టించే ప్రయత్నం చేయగా తృటిలో తప్పించుకున్నారు. అలాగే వీరిని హత్య చేసేందుకు రెండు కత్తులను సైతం కొనుగోలు చేశారు. అయితే దొరికిపోతామనే భయంతో వారు ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు.ఈనెల 16న సమ్మయ్య రమేష్ కు ఫోన్ చేసి శాంతయ్య.. పద్మలు ఇంట్లోనే ఉన్నారని చెప్పాడు. దీంతో లక్ష్మణ్.. రమేష్ లు మంచిర్యాలకు చేరుకొని మద్యం సేవించారు. అనంతరం శ్రీపతి రాజుకు చెందిన ఆటోలో మూడు క్యాన్ల పెట్రోల్ తీసుకొచ్చారు. గుడిపెల్లి శివారులో వాటిని తీసుకెళ్లి సమ్మయ్య.. రమేష్ లు గ్రామంలోకి వెళ్లారు. అనంతరం శాంతయ్య ఉంటున్న ఇంట్లో పెట్రోల్ పోసి తగులబెట్టారు.లక్ష్మణ్ అదే ఆటోలో మంచిర్యాలకు చేరుకొని ఓ లాడ్జిలో ఉదయం వరకు ఉండి లక్కెట్టి పేటకు చేరుకున్నాడు. ఆ మర్నాడు రమేష్ వద్దకు వెళ్లి మంటల్లో ఆరుగురు చనిపోయాడని తెలిపాడు. ఈ హత్యల అనంతరం వీరిద్దరు తప్పించుకొని తిరుగుతుండగా మంచిర్యాలలో సృజన.. ఆమె తండ్రిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సీపీ వెల్లడించారు.

గల్ఫ్ "వలసలు" ఎలా ఆపగలం?

బతుకు భారమై జీవనోపాధి కొరకు గల్ఫ్ దేశాలకు కార్మికులు వలస పోతున్నారు. అభివృధి చెందిన ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే గల్ఫ్ దేశాలకు కార్మికుల వలస ఎక్కువ. గావుందని వలస నిపుణుడు "ఇంటర్ నేషనల్ ఇన్స్యూటూట్ పాపులేషన్ సైన్సెస్ మైగ్రేషన్ అర్బన్ స్టడీస్ విభాగ అధిపతి ప్రొఫెసర్ ఆర్.బి భగత్" తమ అధ్యయనంలో తెలిపారు.

గల్ఫ్ దేశాల వలస కార్మికుల్లో ఎక్కువ మంది దక్షిణ భారత దేశంలోని 5 రాష్ట్రాలైన కర్ణాటక' కేరళ 'తమిళనాడు 'ఎపి తెలంగాణ రాష్ట్రాల నుండి వచ్చినట్లు ప్రొఫెసర్ ఆర్.బి.భగత్ పేర్కొన్నారు ..

ఉత్తర తెలంగాణ గల్ఫ్ వలసలు

రాష్ట్రంలోఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్ , జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, నిర్మల్ ఆదిలాబాద్, హైదరాబాద్ జిల్లాలలో ఉన్న యువకులు ఉపాధి కొరకు గల్ఫ్ దేశాలకు వలస వెళ్ళారు. నాటి సమైక్య రాష్ట్రంలో (ఎ 'పి) ఏర్పడిన తీవ్ర కరువు కాటకాలు :వర్షాభావ పరిస్థితులు వాటికి తోడు నాటి ప్రభుత్వాలు అవలంభించిన ప్రాంతీయ వివక్ష సగటు తెలంగాణ యువకుడిని గల్ఫ్ వైపు చూసేలా చేశాయి.

తెలంగాణలోని పలు జిల్లాల్లో ప్రతి ఊరిలో గల్ఫ్ కార్మికులున్నారు. భూమి లేని సామాజికంగా బలహీన వర్గాల కుటుంబాలనుండి గల్ఫ్ వలసలు ఎక్కువ వున్నాయి.

వ్యవసాయానికి భూమిలేక కూలీలు లభించక' పండిన పంటకు గిట్టుబాటు ధర లేక ' సాగునీరు లేక ఎలాంటి పని లేనిదొరకని స్థితిలో వున్న భూమిని అమ్ముకొని ఏజెంట్ల మాయా మాటల్లో పడి ఉచితంగా వచ్చే వీజా కొరకు లక్షలు ఖర్చు చేసి అప్పుల పాలై ఏజెంట్ల మోసాలకు భలై ఆర్థికంగా దివాలా తీసిన కుటుంభాలుఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. (కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడ్డ సంఘటనలు ఉన్నాయి)

తల్లి 'పెళ్ళాం 'పిల్లలను వదిలి గల్ఫ్ దేశాలకు వలస వచ్చిన యువతదుర్భర జీవితాలను వెల్లదీస్తున్నారని అనేక సర్వేల్లో తేలింది.

కార్మిక చట్టాలు గల్ఫ్ కార్మికులు

గల్ఫ్ దేశాల కార్మిక చట్టాల మీద అవగాహన లేక పోవడం వల్ల కార్మికుల చేత కంపెనీలు తక్కువ వేతనాలకు ఎక్కువ పని గంటలు పనిచేయించుకొని శ్రమదోపిడీకి పాల్పడుతున్నాయి. పోలీసుల రైదింగల్లో పట్టుబడి చేయని నేరానికిజైళ్ళలో మగ్గుతున్న అనేకమంది కార్మికులు దుర్భర జీవితాలనుగడుపుతున్నారు.వారికి ఎలాంటి న్యాయ సహాయం అందడం లేదు. స్వరాష్ట్రం వచ్చిన తర్వాత ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయనే కోటి ఆశలతో ఆకాంక్షలతో ఎదిరిచూసిన తెలంగాణ యువత కునిరాశే మిగిలింది. బతుకు తెరువుకోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్ళేకార్మికుల సంఖ్య తగ్గలేదు.వలసలుఆగలేదు. గల్ఫ్ బాధిత కుటుంబాలసమస్యలు పరిష్కారానికినోచుకోలేదు. గల్ఫ్ దేశాల్లో పనిచేయటానికి భారతదేశం నుండి వెళ్లిన కార్మికుల్లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాలైన. కరీంనగర్ నిజామాబాద్ 'కామారెడ్డి రాజన్న సిరిసిల్ల 'జగిత్యాల 'ఆదిలాబాద్ నిర్మల్' జిల్లాలో దాదాపు ప్రతి ఇంటికి ఒకరు గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన కుటుంబాలు వున్నాయి. హైదరాబాద్ జిల్లా నుండి కూడా తప్పనిసరి పరిస్థితుల్లో గల్ఫ్ కు వలస వెళ్లే యువత ఎక్కువమంది వున్నారు.

విదేశీ మంత్రిత్వశాఖ గణాంకాలు

బతుకు పోరాటంలో గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన వారి వివరాలు విదేశీ మంత్రిత్వ శాఖ ఇటీవల విడుదల చేసింది. 2021 జనవరి నుండి అక్టో బర్ వరకు 2022 జనవరి నుండి అక్టోబర్ వరకు గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన వారి వివరాలు తెలియచేసింది . 2022 జనవరి నుండి అక్టోబర్ నాటికి 9576 మంది కార్మికులు 9 గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారు. వీరిసంఖ్య గత సంవత్సరం 2021 జనవరి నుంచి అక్టోబర్ నాటికి 4375 మంది మాత్రమేవలస వెళ్లగా 2022 నాటికి వీరి సంఖ్య రెట్టింపు కావడంగమనార్హం. తెలంగాణ వచ్చినతర్వాత బతుకులు బాగుపడతాయనుకొన్న గల్ఫ్ వలస కార్మికులకు నిరాశే మిగిలింది.గల్ఫ్ దేశాలకు జరిగే వలసలు కొనసాగుతూనే వున్నాయి .కొత్తగా మలేషియాకు కూడా వలసలు పెరిగాయి 104 మంది కొత్తగా ఉపాధికి వెళ్లినట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖవెల్లడించింది. ఇంతే గాకుండా "టూరిస్ట్ వీజా" మీద ఉపాధి కొరకు అధిక సంఖ్యలో వెళ్లినట్లు స్వచ్ఛంధ సంస్థల సర్వేల్లో వెల్లడైంది. ఉద్యమ సమయంలో కేసీ'ఆర్ గల్ఫ్ బాధితులకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు.

ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పన ఆశించిన మేరకు లేక పోవడం వల్లగల్ఫ్ వలసలు ఆగలేదు. ఉపాధి అవకాశాలు పెరిగాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికి రాష్ట్రంలోపేదరికం నిరుద్యోగం' బాలకార్మికులు ఆర్థిక అసమానతలు 'ప్రకృతివైపరీత్యాలు 'కరువులు 'అతివృష్టిఅనావృష్టి ' పంటలకు గిట్టుబాటుధరలు లేక పోవడం గ్రామీణ చేతివృత్తుల క్షీణత 'ఆర్థిక అవసరాల పెరగడం వల్ల గల్ఫ్ దేశాలకు వలస వెళ్ళక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి.

కరోనా గల్ఫ్ కార్మికులు

కరోనా మహమ్మారి దెబ్బకు ప్రపంచ ఆర్థిక.వ్యవస్థ ఆరోగ్య వ్యవస్థ కుదేలైంది. కరోనా ప్రభావం వల్లగల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్నతెలంగాణ రాష్ట్ర కార్మికులు బిక్కు బిక్కు బిక్కుమంటూ జీవితాలను వెలిబుచ్చుతున్నారు. పలు కంపెనీలు "లాక్ డౌన్" ప్రకటించడం వల్ల చాలా మంది కార్మికులు ఉపాధి కొల్పయ్యారు.రావాణా సౌకర్యాలు మందగించడం వల్ల సొంత ప్రాంతాలకు రాలేక కార్మికులు దుర్భర పరిస్థితుల్లో జీవితాలు వెల్లదిస్తున్నారు. ఇటీవల విమాన రవాణాసౌకర్యాలు మెరుగుపడడంవల్లగల్ఫ్ దేశాలకు వలస వెళ్ళే కార్మికులకుల సంఖ్య పెరిగింది. వలస కార్మికుల సంక్షేమం పట్ల ఆయాదేశాల ప్రభుత్వాలు శ్రద్ధ వహించక పోవడం శోచనీయం బెహ్రాన్ 'ఓమెన్ దేశాల్లో పనిచేస్తున్న వలస కార్మికులను పట్టించుకునే నాథుడే లేడు. ఆదేశాల్లో అనేక కేసుల్లో మన దేశ కార్మికులు ఇరుక్కొని జైలు జీవితంగడుపుతున్న వారిలో తెలంగాణరాష్ట్రానికి చెందిన కార్మికులే ఎక్కువ వున్నారు.

తెలంగాణ ఉద్యమ సమయంలో గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న కార్మికులు గల్ఫ్ జే 'ఏ సి" గావీర్పడి తెలంగాణ రాష్ట్ర అవశ్యకతను ప్రపంచానికి చాటిచెప్పిఉద్యమానికి స్వచ్ఛందంగా విరాళాలు అందించి ఉద్యమానికి బాసటగా నిలిచారు.స్వరాష్ట్రంలోతమ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందనుకొన్న వలసకార్మికుల ఆశలుఅడియాస్సలైనాయి.

గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న కార్మికుల సంఖ్య ను విదేశాంగ మంత్రిత్వశాఖ శాఖ . ఇటీవల విడుదల చేసింది

2021 జనవరి నుండి అక్టోబర్ వరకు, 2022జనవరి నుండి అక్టోబర్ వరకు వివిధ జిల్లాల నుండిగల్ఫ్ దేశాలకువలసవెళ్లిన కార్మికులసంఖ్య ఈవిధంగా వుంది.

కరీంనగర్ 2021(640) 2022(1062) నిజామాబాద్ 2021(1322) 2022.(2476) . . అదిలాబాద్ 2021(360) 2022(670) నిర్మల్ 2021(252) 2022(626) జగిత్యాల 2021(303) 2022(710) హైదరాబాద 2021 (752) 2022.(2235)

గల్ఫ్ దేశాలకు వలసల వెళ్లే కార్మికుల్లో నిజామాబాద్ హైదరాబాద్ 'కరీంనగర్ 'ప్రథమ'ద్వితీయ 'తృతీయ స్థానములోవున్నాయి.

గల్ఫ్ దేశాలైన బెహరాన్' ఇ రాక్... జోర్డాన్ ' కువైట్ 'ఓమెన్'మలేషియా (జంఇ) సౌదీ' ఖతార్ మొదలగు 9 దేశాలకు వలస వెళ్లినకార్మికులు ఎక్కువ సంఖ్యలోఉన్నారు.

ప్రైవేట్ఏజెంట్ల ద్వారా వెళుతున్న వారి సంఖ్య కచ్చితంగా తెలియడం లేదు. ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ రిక్వెస్ట్ ద్వారా 10 వ తరగతి కంటే తక్కువ చదువుకున్న కార్మికుల వివరాలను ప్రభుత్వం సేకరిస్తుంది. ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ నాట్ రిక్వెస్ట్ కింద వెళ్ళే వారి సంఖ్య వివరాలు ప్రభుత్వంవద్ద లేవు. 10 వ తరగతి కంటేఎక్కువ విధ్యారహతలు వుండిగతములో 3 యేళ్ల పాటు పనిచేసిన వారి హిస్టరీ ఐ.టీ. రిటర్న్స్ దాఖలు చేసిన వారికి ఈ.సి.ఆర్ కింద విజాలు జారీచేస్తారు. టూరిస్ట్ విజా కింద వెళ్ళే కార్మికుల వివరాలు ప్రభుత్వం వద్దలేవు.

బతుకు భారమై జీవనోపాధి కొరకు గల్ఫ్ దేశాలకు కార్మికులు వలస పోతున్నారు.

తెలంగాణ ఆవిర్భావం నుండి ఎన్ ఆర్' ఐ :పాలసీ ని గల్ఫ్ దేశాల కార్మికులకు వర్తింప చేయమని గల్ఫ్ కార్మికులకు కోరుతున్నారు.గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్లో రూ"500 కోట్లు కేటాయించి ఆదుకోవాలి అన్న వారి డిమాండ్ నేటివరకు నెరవేరలేదు .ఇటీవల ప్రజా సంగ్రామం యాత్రలో భాగంగా రాష్ట్ర బిజెపి అధ్యక్షులు కరీంనగర్ ఎం'పి 'బండి సంజయ్ కుమార్ జగిత్యాల జిల్లాలో పర్యటిస్తున్న సమయంలో" గల్ఫ్ కార్మికుల సమస్యలను" కేంద్ర ప్రభుత్వ దృష్టికితీసుకవెళ్లి సమస్యల పరిష్కారానికృషి చేస్తానని గల్ఫ్ జె 'ఏ 'సిప్రతినిధుల బృందానికి హామీఇవ్వడం' గల్ఫ్ బాధితకుటుంబాలకు గొప్ప ఊరట ఇచ్చే అంశంగాగా పేర్కోవచ్చు.2016 సంవత్సరంలో రాష్ట్రప్రభుత్వంగల్ఫ్ దేశాలకు వలసలు అరికట్టడానికి సాధారణ పరిపాలన శాఖ ఎన్ 'ఆర్ 'ఐ 'సెల్ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. ప్రైవేట్ ఎజెంట్ల బారిన పడకుండా వారి మోసాలను అరికట్టడానికి ప్రభుత్వమే "మాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (ఏజెన్సి)నునెలకొల్పింది.ఎన్' ఆర్ 'ఐ 'సెల్ గల్ఫ్ వలసలనుఆపలేక పోయింది . విదేశీ వ్యవహారాలమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎం'ఏ'డి'ఎ'డీ వెబ్ సైట్ ద్వారా గల్ఫ్ బాధితులకు సహాయం పొందటానికి కార్మికులు ధరకాస్తు చేసుకోవచ్చు. ఎన్ 'ఆర్' ఐ సెల్ అలంకార ప్రారంభమైందన్న విమర్శలున్నాయి.

సామాజిక ఆర్థిక వేత్తల ఆందోళన

రాష్ట్ర రాజధానిలో (హైదరాబాద్) కొన్ని ముఖ్య నగరాలలో ఉత్తరప్రదేశ్' మధ్య ప్రదేశ్' ఒరిస్సా ఛత్తీస్గఢ్ 'జార్ఖండ్ 'బీహార్ రాష్ట్రాల నుండి లక్షలాది కార్మికులు వచ్చి ఇక్కడ ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. పొందుతున్న ఆదాయాలను తమ రాష్ట్రాలకు పంపుతున్నారు. ఇక్కడి కార్మికులు ఉపాధి కొరకు గల్ఫ్ దేశాలకు వెళ్ళే విచిత్రమైన పరిస్థితులు పట్ల సామాజిక 'ఆర్థిక 'పాలనా వేత్తలు తీవ్ర ఆందోన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రములో ఆయా ప్రాంతాలలో లభించే వనరులు అవసరాలు దృష్టిలో పెట్టుకొని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి."స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ "నెలకొల్పి తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించడం మీద ప్రభుత్వం దృష్టి పెట్టలేదన్న విమర్శలున్నాయి.

ప్రభుత్వం గల్ఫ్ సంక్షేమ నిధి

ప్రభుత్వం 500 కోట్ల రూపాయలతో "గల్ఫ్ కార్మికుల సంక్షేమ నిధి'' తోఎన్ 'ఐ సెల్ ఏర్పాటుచేసి గల్ఫ్ దేశాల్లో పనిచేస్తు చనిపోయిన కార్మికుని కుటుంభానికి 5 లక్షల రూపాయలు "ఎక్స్ గ్రేసియా" చెల్లించి ఆర్థికంగా ఆదుకోవాలి.

గల్ఫ్ వలసలు నివారణా చర్యలు

1)గల్ఫ్ బాధితుల కుటుంబాలకు చెందిన బాల 'బాలికల కోసం రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో కొన్ని సీట్లు కేటాయిస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి

2) గల్ఫ్ బాధిత కుటుంబాలకు ఉచిత విద్య 'ఉచిత వైద్యం ఉచిత న్యాయ సహాయం అందించాలి.

3)కేంద్ర' రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంక్షేమ అభివృద్ధి వ్యూహాన్ని అమలు చేసి కార్మికుల ఆర్థిక సామాజిక 'ఆరోగ్య.స్థితి గతులను మెరుగు పరిచే చర్యలు చేపట్టాలి. కార్మికులకు జీవిత భీమా ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలి.

4) గల్ఫ్ దేశాల వలసలకు దారి తీసిన పరిస్థితులు స్థానిక.వనరుల లభ్యత 'ఉపాధి అవకాశాలు? ఏమి ఉత్పత్తి చెయ్యాలి? ఎలా ఉత్పత్తి చెయ్యాలి? ఎవరికోసం ఉత్పత్తి చెయ్యాలి? అనే అంశాల మీద ప్రభుత్వం "నిపుణుల కమిటీ" చేత అధ్యయనం చేయించాలి.

5).ప్రభుత్వం సూక్ష్మ స

నేటినిజం
సాహితీ కిరణాలు
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 22-12-2022

నానీలు

కలం కదలట్లేదు
ఎందుకో
ఆలోచిస్తే
పక్కన నువ్వు లేవు.

వజ్రాలువజ్రాలు
నాకెందుకులే
ముత్యాలు కావాలి
నవ్వుల్లోంచి రాల్చడానికి

-ఎన్. లహరి
9885535506

గుండె గాయాలకు
మందు ఉంది
నాలుగక్షరాలను
లేపనంగా రాసుకో!.

మనసు బాలేదా
పుస్తక నేస్తంతో
చెలిమి చెయ్యి
కుదుటపడుతుంది.

గుంటూరాయం

పని చేస్తేనే
ఒళ్లు
పరిశుభ్రం చేస్తేనే
ఇల్లు.

అవమానాలకు
ఆజ్యం పోయకు
చాణక్యుడి శపథం
మరువకు.

ఎంతో సంపాదించామని
ఎగిరిపడితే ఎలా?
ఎలా సంపాదించామనేదే
ప్రధానం కదా

గడీలకు
గడియలెక్కువ
గడుడిసెలకు
గోడలు తక్కువ.

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

మనిషికీ ప్రకృతికీ మళ్లీ ఊపిరులు కావాలి

- డా. కత్తి పద్మారావు
సామాజిక తత్త్వవేత్త
దళిత ఉద్యమ నేత
సెల్: 9849741695

ఆకాశంలో మబ్బుల మేడలు
పచ్చిక బయళ్లపై
నక్షత్రాల మెరుపులు
ఏదో ఈల పాటకు
పక్షుల కళ్ళల్లో వెలుగుల సవ్వడి
ఆ పక్షుల రెక్కల చప్పుడులో
చిగురాకులు పోటమరిస్తున్న సడి
ఆ నేలపై విత్తులు జల్లే
ఆ పడతి కళ్ళల్లో
తరుల విరుల జల్లు
ఆ కొలనులో బాతు నిబ్బరం
ఓ రూప శిల్పాన్ని
దృశ్యీకరిస్తుంది
ఎక్కడో ఓ సన్నని రాగం
చెవులకింపుగా వినిపిస్తుంది
ఒక్కోసారి ఆకసమంతా
నీలంగా కనిపిస్తున్నప్పుడు
పచ్చని గడ్డి
మైదానంలా భాషిస్తుంది
ఎందుకో ప్రకృతి అంతా
నిశ్శబ్దంగా ఉంది
ఆ ఎండు గడ్డిపోచలు
గాలికి ఊగుతున్నప్పుడు
గీత రుతి.
మనిషికి ఇంకా నిశ్శబ్దం
అలవడసి ఉంది
ఆ గొర్రెల కాపరి
కర్ర భుజాన వేసుకుని
కనుసైగతో వెయ్యి గొర్రెలను
కొండమీదకు తీసుకువెళుతున్నాడు
యజమాని నిశ్వబ్దానికి
అవి మురిసిపోతున్నాయి
ఆ వాచాలుడు
మాట్లాడుతూనే ఉన్నాడు
వారు నిశ్శబ్దాన్ని
ఛేదిస్తూనే ఉన్నారు
ఎందరో మనసులను
గాయపరుస్తున్నారు
వారి మాటలు ముళ్ల పొదలు
ఎందరి విద్యా శక్తినో
ఆ నిందలు ధ్వంసం చేశాయి
భాష
మానవ అభివ్యక్తి వాహిక
గుండెల్లో గునపాలు గుచ్చే
వాగ్భూషకులు వారు
అందే గొప్ప గొప్ప
బిరుదులు పొందారు
ఒక అక్షరం దిద్దడానికి
ఉపక్రమించిన మునివెళ్లను
నరికిన పండితులు వారు
శబ్దంలో ఇంత కర్కశత్వం
దాగుందా?!
అందుకే ఆ పక్షులు
ఒక్క కూతతోనే
తమ భావోద్వేగాలను
వ్యక్తం చేస్తున్నాయి
ఆ పాలకుడు అత్యంత
సుందరమైన భాషలో
దేశ సంపదను
వేల వేస్తున్నాడు!?
యువకులు పనిలేక
హద్దులు దాటి పరుగెడుతున్నారు
మన రత్నగర్భనెవరో దొంగలు
తవ్వుకెళ్తున్నారు
ఆ హుండీ నిండా
బంగారపు ఆభరణాలే!
టన్నుల టన్నుల పసిడితో
విగ్రహాలు మెరుస్తున్నాయి
ఆ ముదుసలి
చివరి శ్వాస వరకూ
ఒక్క నగనూ పెట్టుకోలేదు
పసిడిని చూడని
కళ్ళు ఆమెవి
ఆమెకు ఈ దేశం
ఈ ఊరు
ఈ వాడా
తన గుడిసె తప్ప
ఏమీ తెలియవు
తాను మరణించినప్పుడు
కాళ్ళకు మట్టి అంటుకుని ఉంది

చేతికి రంధ్రాలు
అలానే ఉన్నాయి
తన చివరి రక్తపు బొట్టు వరకూ
ఈ దేశానికి అర్పించుకున్న
త్యాగమూర్తి ఆమె.
ఆమెను మట్టి చేయడానికి
తన కొడుకు ఊరులో లేడు
కడుపు చేతబట్టుకొని
పనికోసం పరుగులెత్తాడు
ఆ విచిత్ర వేషదారుడికి
ఈ కన్నీటి కథ తెలియదంటరా?
కానీ తెలిసీ నటిస్తున్నారా?
భారతంలో ఎన్నో
ఉపనాటకాలు నడుస్తున్నాయి
భగవద్గీతను రోజూ
పఠిస్తున్నారు
ఆకలి చావుకు
ముడిపెడుతున్నారు
అబద్ధాలు క్రుమ్మరించి
కోట్లకు పడగలెత్తుతున్నారు
మాటల మూటలు వెదజల్లి
ఓట్లు సంపాదిస్తున్నారు.
గలుపులోన... ఓటమి లోనూ...
అంతా అవినీతే!
అంతా రాజ్యాంగ
ఉల్లంఘనే?
ఢిల్లీకి ఊపిరి ఆడడం లేదు
అలహాబాద్‌లో
కాషాయం వేటు
వధకు, వంచనకు
జనం వంత పాడుతున్నారు!
తమ గోతులు తామే
తవ్వుకుంటున్నారు
నేల చవుడు బారింది
విత్తులు మొలకెత్తడం లేదు
అందుకే మనిషికి, ప్రకృతికి
కొత్త ఊపిరులు కావాలి
జీవం ఎక్కడో లేదు
కన్నీటిని తుడవడంలో ఉంది
ప్రేమ ఎక్కడో లేదు
రెండు హృదయాలు
కలవడంలో ఉంది
గుండెకు గుండెకూ మధ్య
గోడలెందుకు?
కులం
ఒక ఎండుమిరపగాయల మండె
దానిలోకి వెళితే
కోరు తప్ప ఏమీ మిగలదు
కులం లేని జీవితమే
మల్లె తోట
అందులో నుండి
సౌగంధ్యం వస్తుంది
ఈ దేశం నాది
అనే భావం లేనివాడు
అంతర్గత శత్రువు
శత్రువు ఎక్కడో లేడు
మనతోనే ఉన్నాడు
అతడు మనల్ని నిరంతరం
కులం కత్తితో
వధించాలని చూస్తున్నాడు
ద్వేషం నుండి పగ పుడుతుంది
కులాధిపత్యం
అహేతుక ద్వేషం
కులం రొంపిలో జీవిస్తూ
అత్తరు జల్లుకుంటున్నారు
కులానికి ఒక శ్మశానం ఉన్న
దేశమిది!
పుర్రెలకు కులం లేదు సుమా!
మీరు తగులబెట్టుకోండి
మేము పూడ్చేసుకుంటాం
చరిత్రకు మేమే సాక్షులం
ఆ ముసలమ్మ కన్నీరు
అగ్ని మంటలు రగిలిస్తుంది
ఆ నిశ్శబ్దంలో విప్లవం ఉంది
ఆ విప్లవమే మరో స్వాతంత్ర్య
పోరాటానికి కేక.

ఎనిమిది దశాబ్దాల తెలంగాణ కవితా దోరణులను అవగాహనకు తెచ్చే 'తరాజు'

బహుముఖ ప్రజ్ఞాశాలి డా॥ కాంచనపల్లి గోవర్ధన రాజు విశేష అభివ్యక్తి మరోసారి నిరూపించ బడింది. ఈ సాహిత్య వ్యాసాల సంపుటి 'తరాజు'లో. వివిధ సందర్భాలలో రాసిన వ్యాసాలు, చేసిన ప్రసంగాలు, ముందుమాటలు ఈ సంపుటిలో చోటుచేసుకున్నాయి. రాగద్వేషాలు కతీతంగా, నిష్పక్షపాతంగా వ్యక్తీకరించబడిన ఈ వ్యాసాలు గత ఎనిమిది దశాబ్దాలు తెలంగాణ కవితా దోరణులను అవగాహనకు తెస్తాయి.

సంపుటిలో మొదటి అధ్యాయాలలో ఈ ప్రాంతపు కవిత్వాన్ని వెలువరించిన సందర్భాలని, కవిత్వ లక్షణాలని ప్రదర్శితమైన నైపుణ్యాలని వివరిస్తాయి. వేరు తెలంగాణ ఉద్యమానికి ముందు, ఆ తర్వాత వచ్చిన కవిత్వంపై విమర్శావివరణలున్నాయి. పరిచయ వ్యాక్యాలలో ప్రముఖ సాహితీవేత్త పాలపిట్ట పత్రికాధిపతి శ్రీ గుడిపాటి గారు రచయితను "దైనందిన కార్యక్రమాల్లో రచన అంతర్భాగమైంది'' అని ప్రస్తుతించారు.

నిజాము నాటి తెలంగాణ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న దాశరథి కవిత్వంలోని సౌందర్యం, అనుభవసారం రసనిష్టత్తి వివరించారు. సి.నా.రె. గారి కవితా ప్రస్థానం, వారి భావ, అభ్యుదయ, విప్లవ కవిత్వాన్ని, తెలంగాణ ప్రజలకు వారిపై ఉన్న గౌరవ మర్యాదల్ని వ్రాసారు. సి.నా.రె. గారితో తన అనుభవాల్ని వారి సిద్ధాంత గ్రంథం "ఆధునికాంధ్ర కవిత్వము సాంప్రదాయములు ప్రయోగములు" తనకెంతో ఉపయుక్తమైనవని చెబుతూ, 'విశ్వంభర' తెలుగు సాహిత్యానికి జ్ఞానపీఠ్ అవార్డు తెచ్చిన కావ్యమే కాకుండా, తనకంటూ ప్రత్యేకంగా నిర్మించుకున్న పద్ధతిలోనే రచన నడిచిందని వివరించటం ఈ వ్యాసకర్త లోతైన విమర్శన దృష్టికి తార్కాణం అంటారు.



పోతే... ఆధునిక కాలంలోని నిఘంటువుల సంగతి. నా దృష్టిలో ఆధునిక కాలం అంటే ఇంగ్లండులో 1476లో ముద్రణ ప్రారంభం ఐన నాటి నుండే! గుటెన్‌బర్గ్, కాక్‌స్టనో ఎవరైతేనేం ముద్రణా యంత్ర ఆవిష్కర్తలకు విశ్వమానవాళి మొత్తం ఋణపడి వుండాల్సిందే!! 1440-1479 ప్రాంతాల్లో ఇంగ్లీషు పదాలకు లాటిన్‌లో అర్థాలిచ్చే నిఘంటు ప్రయత్నం ఒకటి జరిగింది. ఇంగ్లండులో ఆంగ్లం కన్న ముందు ఫ్రెంచ్, ఇంకా మునుపు లాటిన్ భాషలదే పెత్తనం. పైగా ఆంగ్లం మాట్లాడితే చిన్నచూపు. ఛాసర్ తదితరులొచ్చాక పరిస్థితి మారింది. ఇంగ్లండ్ - ఫ్రాన్సు యుద్ధ ఫలితంగా ఆంగ్ల భాషాభిమానం పెల్లుబికింది. క్రీ.శ. 1640 కల్లా ఇంగ్లీషులో సుమారు 20,000 పుస్తకాలు అచ్చయ్యాయట. 1582లోనే ముల "కాస్టర్ అనే పెద్దమనిషి "ప్రపంచంలో అత్యంత ప్రయోజనకరమైన పని నిఘంటు నిర్మాణం'' అని నొక్కి చెప్పాడు. 1635లో ''ఫ్రెంచి అకాడమీ" ఏర్పడి 59 ఏండ్లు శ్రమించి ఫ్రెంచి నిఘంటువు తెచ్చుకున్నారు. ఆంగ్లేయులకు అప్పుడు సోయి వచ్చిన కారణంగా 1604లో కౌడ్రే ఓ నిఘంటువు తెచ్చాడు. 1658లో ఫిలిప్స్, 1721లో నథానియల్‌లు డిక్షనరీలు వేసారు. ఐనా... అవి సమగ్రం కావు. ఓరోజు 1745 సం॥లో డోడ్‌స్లే అనే పుస్తకాల వ్యాపారి సామ్యూల్ జాన్సన్ నిఘంటు రచన చేయమన్నాడు. జాన్సన్ నిఘంటు నిర్మాణానికి మూడేళ్ళు అవసరం అంటే ఆ వ్యాపారి అంత తొందరగా ఎలా యివ్వగలడని వదిలేసాడు. కానీ జాన్సన్ ఎనిమిదేళ్ళలో నిఘంటువు పూర్తి చేసాడు. ఆ కాలంలోనే భార్యను పోగొట్టుకున్నాడు. అనేకమైన ఆర్థిక యిబ్బందులతో సతమతమై పోయాడు. తయారైన నిఘంటువును ప్రచురించడానికి అర్ల్ మొదలైన పండితుల్ని ఆశ్రయించాడు. ఏ ఒక్కరూ సహకరించకున్నా జాన్సన్ నిఘంటువు క్రీ.శ. 1755లో ప్రకటితమైంది. దానికి గొప్ప స్పందన లభించింది. నిజానికి ఆంగ్లంలో చెప్పుకోదగిన, మొట్టమొదటి లెక్సికోగ్రాఫర్ ఈయనే! ఆ తర్వాత ఈ నిఘంటువే 1828లో వెబర్ డిక్షనరీకి, 1926లో ఆక్స్‌ఫర్డు నిఘంటువుకీ గొప్ప స్ఫూర్తి. ఈ ఆధునిక కాల నిఘంటువులు అన్నీ అకారాదిగా వుండటం విశేషం.

'సమాంతర స్వాప్నికుడు కవి ఎస్.వి.' అన్న అధ్యాయంలో ప్రొఫెసర్ ఎస్.వి. సత్యనారాయణ గారిని 'ఈనాటి సమాంతర స్థితి ఆయన ప్రతి అక్షరంలోను ప్రతిఫలిస్తుంది. రేపటి నిర్మాణానికి ఆయన జ్వలించే నిప్పుకణం అంటూ వారిలోని వస్తు స్పష్టత చెప్పారు. తనకంటూ ఓ ప్రత్యేకమైన ముద్ర' అన్నపరం దేవేందర్‌కు ఉందని తెలంగాణ చైతన్యమే ఇతని వ్యక్తీకరణకు అంతస్సూత్రం అనటం బావుంది.

'వెనుదిరిగి చూడని అడుగు'లో ఆచార్య ఎన్.గోపి గారి సాహితీ జైత్ర యాత్రలో ప్రతి అడుగూ వెనుదిరిగి చూడనిదే అంటారు. స్వేచ్ఛానువాదం గురించి చెబుతూ 'ఇది ఒక నిగ్రహంతో కూడుకున్న' పని. మూలకవిని అర్థం చేసుకోవటం ఒక ఎత్తు అయితే, అనువాదంలో అనువాదకుడు ప్రవేశించకుండా మూలాలను, మూల వ్యక్తిత్వానికి దెబ్బ తగులకుండా జాగ్రత్త పడాలనటం బావుంది. ఇది కాచి వడపోసిన సత్యం.

కవిత్వమై వెలిగిన కుంపటి (బాణాల శ్రీనివాస్) వెచ్చదనం, ఏనుగు నరసింహారెడ్డి రుబాయిల పరిశీలన, మకర హృదయంలో మానవకోణం వంటి ఇతర వ్యాసాల్లో ఆయా కవులను నిశితంగా పరిశీలించి తనదైన విశిష్టభాషాపటిమ, విలక్షణ వ్యాఖ్యానంలో చదువరులను అలరిస్తారు.

తెలంగాణ సాహిత్యాన్ని చదివే, బోధించే, చేధించే వారందరికీ ఉపయుక్త గ్రంథమని ప్రకాశకులచే కొనియాడబడ్డ ఈ సాహిత్యవ్యాసాల సంపుటిని, శ్రీ పీచర విజయేందర్ రావు తన ధర్మపత్ని శ్రీమతి పీచర సునీతారావు స్మృత్యర్థం ప్రచురించి పాఠకుల కందిస్తున్నారు.

ప్రతులకు:
డా॥ కాంచనపల్లి గోవర్ధన రాజు
సెల్: 96760 96614

-పొలమరశెట్టి కృష్ణారావు
సెల్: 9676544764

గొప్ప అనుభూతిని పంచే సంకలనం "ఇప్పుడిప్పుడే"

- తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి రమణ

ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు దాస్యం సేనాధిపతి రచించిన "ఇప్పుడిప్పుడే" గొప్ప అనుభూతిని పంచే సంకలనమని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి. రమణ అన్నారు. డిసెంబర్ 18న హైదరాబాదులోని చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళావేదికలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, శ్రీ త్యాగరాయ గాన సభ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడిన "ఇప్పుడిప్పుడే" ఆవిష్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ... చక్కని భావుకతతో కవిత్వాన్ని రాసిన సేనాధిపతి అభినందనీయులని అన్నారు. ఏదో ఒక వాదానికి కట్టుబడకుండా భిన్న భావాలు... భిన్న అంశాలతో రాసిన దాస్యం తమ కవిత్వంలో ప్రకృతి, మానవ సంబంధాలకు పెద్దపీట వేశారని కొనియాడారు. అమ్మానాన్నలపై రాసిన కవితల్లో దాస్యం కొత్త కోణాన్ని ఆవిష్కరించారని పేర్కొన్నారు. కవిత్వానికి కాదేదీ అనర్హమని శ్రీశ్రీ అన్నట్లు... " తాత చెప్పులు" శీర్షికతో రాసిన కవితతో పాఠకులను మెప్పించేలా రాసారని అభినందించారు. భావుకత ఉట్టిపడేలా అఖండ అనుభూతితో నిండిన ఖండకావ్యం "ఇప్పుడిప్పుడే" అని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన నేటి నిజం పత్రికా సంపాదకులు శ్రీ బైస దేవదాస్ మాట్లాడుతూ వందల మందిని శిష్యులుగా చేసుకొని వారిని కవులుగా తీర్చిదిద్దుతున్న దాస్యం సేనాధిపతి అన్ని సాహిత్య ప్రక్రియల్లో ప్రతిభావంతుడని పేర్కొన్నారు. వందలాది పుస్తకాలకు సమీక్షలు రాసిన అనుభవం ఆయనకు ఉందని అభినందించారు. "ఇప్పుడిప్పుడే" కవితా సంపుటిలోని కవితలన్నీ ఆయన రచనా వైచిత్రికి అద్దం పట్టేలా ఉన్నాయని అన్నారు. పుటం పెట్టిన అక్షర సంతకం తోనే...మార్చగలం... అసమానతల సమాజ ముఖచిత్రాన్ని అంటూ ఈ సంకలనంలో రాసిన పంక్తులను ప్రస్తావించారు.

పుస్తకావిష్కరణలో సుబ్బారావు, శ్రీమతి గీతారాణి, మౌనశ్రీ మల్లిక్, డా॥ అమ్మంగి వేణుగోపాల్, బైస దేవదాసు, ఆవిష్కర్త డా॥ కె.వి. రమణాచారి, దాస్యం సేనాధిపతి, ఆచార్య కడారు వీరారెడ్డి, మద్దాలి రఘురాం.

కవిత్వ సృజనలో ఆయనకున్న అవగాహనను తెలియజెప్పేలా ఈ గ్రంథంలోని "సాంత్వన" కవిత రూపుదిద్దుతుందని పేర్కొన్నారు. గత పదహారు ఏళ్లుగా పదహారు గ్రంథాలను వివిధ ప్రక్రియల్లో వెలువరించడమే గాక...ఎంతో మందిని కవులుగా తీర్చిదిద్దుతున్న దాస్యం కు ప్రభుత్వ పరంగా గుర్తింపు రాకపోవడం విచారకరం అని అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ప్రసిద్ధ కవి,రాష్ట్ర ప్రభుత్వ కాళోజి నారాయణరావు తొలి పురస్కార గ్రహీత డా. అమ్మంగి వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతి కవికీ ఒక తత్వం,ఫిలాసఫీ ఉంటుందని తెలిపారు. దాస్యం సేనాధిపతి జీవిత తత్వం తెలిసిన కవి అని ఆయన కలంలో సున్నితపుత్రాసులున్నా యేమో ననీ...అందుకే భావం... భాష రెండూ సమతుల్యత కలిగి ఆయన కవిత్వం విలువను పెంచాయని కొనియాడారు. దాస్యం రాసిన "లేడీ టీచర్" కవిత ఆయనకు మంచి పేరును తెచ్చి పెట్టిందని... అందులోని ప్రతి పంక్తి జీవన సత్యాలను మోసుకొచ్చాయని తెలిపారు.

దాస్యం సేనాధిపతి-శ్రీమతి గీతారాణి దంపతులను సత్కరిస్తున్న అతిథులు.

దాస్యం కవిత్వంలో ఎక్కువ ఆర్భాటం...అట్టహాసం ఉండవు, చాలా కవితలు మంచులో తడిసిన పూల లాగా గుబాళిస్తాయని పేర్కొన్నారు. మరో విశిష్ట అతిథిగా హాజరైన ప్రముఖ కవి, రచయిత, శాతవాహన విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కడారు వీరారెడ్డి మాట్లాడుతూ దాస్యం కవిత్వంలో అలతి అలతి పదాలలో అద్భుత భావాలను చూడగలమని తెలిపారు. ఇప్పుడిప్పుడే కవితా సంపుటిలోని కవితలు చక్కని సందేశాలను మోసుకొచ్చాయని అన్నారు రచనా రంగంలో సేనాధిపతి అందించిన సహకారాన్ని గుర్తు చేసుకున్నారు. గ్రంథాన్ని సమీక్షించిన ఆత్మీయ అతిథి, ప్రముఖ కవి, సినీ గీత రచయిత మౌనశ్రీ మల్లిక్ మాట్లాడుతూ... ప్రకృతి రమణీయతను, భావ కవిత్వాన్ని, మసకబారుతున్న మానవ సంబంధాలకు మెరుగులు అద్దాలన్న సంకల్పంతో దాస్యం రాసిన కవితలు అందర్నీ ఇట్టే ఆకట్టుకునేలా ఉన్నాయని పేర్కొన్నారు.

దాస్యం కవిత్వాన్ని నేను గౌరవిస్తున్నానని తెలిపారు.

ఆయన కలం నుండి జాలువారిన "దిక్సూచి" కొత్త కవులకు మార్గదర్శకంగా నిలిచిందని అన్నారు. "ఇప్పుడిప్పుడే" కవితా సంపుటిలోని "లేడీ టీచర్" కవితను దృశ్యమానం చేస్తూ రూపొందించిన వీడియో పక్షం రోజుల్లోనే వేలాది మందిని ఆకట్టుకోవడం విశేషమని అన్నారు. గ్రంథకర్త దాస్యం సేనాధిపతి మాట్లాడుతూ...తన గ్రంథానికి "ఇప్పుడిప్పుడే" పేరు వైవిధ్యం కోసమే పెట్టానని తెలిపారు. సమాజంలో ప్రతిరోజు మన చుట్టూ జరిగే సంఘటనలు, ప్రకృతి, మానవ సంబంధాలు, ఇతర కవితా వస్తువులతో ఈ కవితా సంపుటిని తీర్చిదిద్దానని పేర్కొన్నారు. ఆవిష్కరణ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తన సాహితీయానాన్ని ప్రోత్సహిస్తున్న ఆయన సతీమణి శ్రీమతి గీతారాణికి ఈ పుస్తకాన్ని సభలో అంకితం ఇచ్చారు.

కిన్నెర ఆర్ట్ థియేటర్స్ పక్షాన దాస్యం దంపతులను మల్లాది రఘురాం ఘనంగా సత్కరించారు. శ్రీకాకుళం నుండి ప్రత్యేకంగా విచ్చేసిన సీనియర్ కవయిత్రి శ్రీమతి భాస్కర బాలభారతి, బుక్కపట్నం రమాదేవి, లక్ష్మీ పద్మజ దుగ్గరాజు, హాజరయిన కవి మిత్రులు శ్రీ దాస్యం దంపతులను ఆత్మీయంగా సన్మానించారు. ఈ సభలో ప్రముఖ కవి, విమర్శకులు శ్రీరమణ వెలమకణ్ణి,రాష్ట్ర ప్రభుత్వ అవార్డు గ్రహీత శ్రీ కందుకూరి శ్రీరాములు, ప్రముఖ పద్య కవి, రచయిత శ్రీ దోరవేటి, ప్రముఖ కవులు దాసరి మోహన్, అవేరా, రఘు వీర్ ప్రతాప్,డా. వింజామర సరోజ, డా. కే.ఎల్. వి. ప్రసాద్, శ్యాంసుందర్, డా. చీదెళ్ల సీతాలక్ష్మి దంపతులు, పూదత్తు కృష్ణమోహన్ దంపతులు, మధుసూదన్ దంపతులు,కెప్టెన్ రేళ్ల సంజీవ్, పోరంకి విజయలక్ష్మి, కుడిక్యాల వంశీధర్, నందిమల్ల మాధవి, సుధా మైత్రేయి, అక్షర కౌముది వెంకటరమణ, మామిడి వేణు మాధవ శర్మ, జి.సాయి చంద్రశేఖర్, కందుకూరు మనోహర్,శ్రీ టి. వెంకటేశ్వర్లు, దాస్యం కుమారులు దాస్యం వినోద్ కుమార్ , దాస్యం ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. సుబ్బారావు వందన సమర్పణ చేశారు.

జ్ఞానమే ఆయుధం

విజ్ఞానం విస్తరిస్తుంటే
అజ్ఞానం మరుగుపడుతుంది
జ్ఞానం అజ్ఞానాన్ని తరిమికొట్టాలి
నిస్వార్థపు జ్ఞానాన్ని మనసులో పెట్టాలి
అజ్ఞానానికి విసుగుపుట్టదు
వద్దన్నా గతి వస్తూనే ఉంటుంది
మనిషిని తన వశం చేసుకోవాలనుంటుంది
అజ్ఞానం రెక్కలు వంటిదే!
పట్టుకుంటే వదలదు!
రెండు శాశ్వతంగా తరిమికొట్టే జ్ఞానం
మనిషిలోని వివేకమే!
అదే మనిషిని కాపాడే ఆయుధం!
రెండు సాధిస్తే సర్వదా విజయమే!
అజ్ఞానం ఏమాత్రం ఉన్నా అపజయమే!

డా॥ అనుమాండ్ల సత్యేశ్వరశర్మ
9440468557.

ఏది గొప్పగా చెప్పుకోకు

నీకు నీవే గొప్పగా చెప్పుకోకు..
గప్పాలతో డప్పులు కొట్టుకోకు
అసహ్యం పుట్టిస్తోంది...
ఈ అలవాటు తప్పని తెలుసుకో

నీలో ఉన్నది యేదో చూపు..
భవితను దిద్దే మార్గముందా..?
మంచిని నేర్పే మౌనముందా..?
జాతిని జాగృతపరుస్తున్నావా..?

సామాజిక అంశాలతో నడుస్తున్నావా..?
ఆత్మీయత అందరికీ పంచుతున్నావా?
ఏ విధంగా గొప్పలు చెప్పుకుంటున్నావు!!
గొప్పోడినని భావిస్తున్నావు..!!

నిస్వార్థంగా సేవచేస్తున్నవా..!!?
నిర్భాగ్యులకు నీడను ఇస్తున్నావా!!
అనాధలకు ఆసరా అవుతున్నావా!!
కాలగమనంలో గతితప్పి
తిరుగుచున్నవారికి...
సహాయం చేస్తున్నావా..!!
అసమానతల అడ్డుగోడలు తొలిగించావా!?
సమానత్వపు దారిలో నడిపించావా!!?
సమసమాజంవైపు అడుగులు వేయించావా!?

నీలో దాగివున్న పైత్యాన్ని తొలిగించుకో...
అపుడే ప్రపంచంలోని నిజాలు కనబడతాయి..
ఏదో నింపుకున్న నిషాలో ఉన్నావు..
నిజమైన ఉషోదయంలోకిరా...!!
నీకు నీవే తెలుసుకోలేని
పొరపాట్లు చేస్తున్నావు...
తప్పటడుగులు వేస్తున్నావు...
అన్నీ మరిచిపోయి ఏదేదో
వాగేస్తున్నావు...
నిన్ను నీవు సమర్థించుకుంటున్నావు..

చెలిమి లేదు..చైతన్యపు నడకలేదు..
ఎగురుతున్న నీ మాటలు
సర్రున చూపులను తెంపేస్తోంది..!!
నిజాలను నరికేస్తోంది..!!
స్వార్థమే పరమార్థమని నమ్మేస్తుంది!!

మత్తునుంచి నీ విలాసాల
గమ్మత్తు నుంచి బయటికిరా..!!
నిలదీసి నిప్పులు కక్కిస్తారు..
నువ్వు కుప్పకూలి పోతావు...
వ్యర్థవాగుడు ఆపి వర్తమానంలోనికిరా...!!

నిబద్ధత అంటావు,అబద్ధమాడుతావు..
నీకు నీవే గుట్టు బయట పెట్టుకుంటావు...
రట్టు చేసి రచ్చకీడుస్తారు...
నీవో పెద్ద బద్ధకస్తుడివి...
నీలా ఎందరెందరో ఉన్నారు...
అందరికి ఇదే హెచ్చరిక..!!

-అంబటి నారాయణ
984932801

బాల్యం- వృద్ధాప్యం...!

జీవిత చరమాంకంలో నేను..
జీవితారంభంలో నువ్వు...!
పరిపక్వతతో నేను..
పసి పిల్లాడిగా నువ్వు...!
పండు టాకు వలె నేను..
పసిడిప్రాయంతో నువ్వు..!
చదివిన, చిరిగిన పుస్తకం నేను..
తెరవని పొత్తం నువ్వు...!
జ్ఞాపకాల దొంతరను నేను..
రాయని తెల్ల కాగితం నువ్వు..!
మహా ప్రస్థానం కోసం నిరీక్షణ నాది..
మరో ప్రస్థానం కోసం నిరీక్షణ నీది...!
అవసాన దశ నాది..
అమాయకత్వం నీది..!
సుస్కించిన దేహంతో నేను..
శుభ్రమైనఒడలితో నువ్వు..!
కరువు కాలాలను చూసింది నేను..
పెరుగుతున్న కొద్దీ
సమస్యల చిట్టా ఏకరువు పెట్టేది నువ్వు..!
పండిపోయిన జుట్టుతో నేను..
పడి లేచే దశలో నువ్వు..!
తెల్ల మొఖంతో నేను..
బోసి నవ్వులతో నువ్వు..!
అమ్మ ఒడి, వేలు నీకు ఊతం..
చేతి కర్ర నాకు సాయం..!
నువ్వు ఇంట్లో అందరికీ ఆట వస్తువు అయితే..
అదే ఇంట్లో నేను
అందరికీ భారమైపోతా..!?
నువ్వు బుడిబుడి అడుగులతో పెరిగితే..
నేను వడివడిగా
ఉత్తరం వైపు సాగుతాను...!
జీవితమనే నాటకంలో
నా పాత్ర ముగుస్తుంది...!
ప్రపంచమనే రంగస్థలానికి
నీ పాత్ర పరిచయం అవుతుంది...!

-డాక్టర్. మహమ్మద్. హసన్
9908059234

ఆహ్వానం
డా॥ కపిలవాయి లింగమూర్తి సాహిత్య కళాపీఠం, నాగర్‌కర్నూల్
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, హైదరాబాద్ వారి
సంయుక్త నిర్వహణలో
శ్రీమతి గున్న ఆండాలమ్మ గారి స్మారకార్థం
అవార్డుల ప్రదానోత్సవం
డా॥ కపిలవాయి లింగమూర్తి గ్రంథావిష్కరణ
ఉమ్మడి పాలమూరు జిల్లా కవిపండిత వంశాలు - యోగులు
డా॥ కపిలవాయి లింగమూర్తి-మీనాక్షమ్మల సాహిత్య పురస్కారం
పురస్కార గ్రహీతలు
2020 : యెన్నం రుక్మాంగద రెడ్డి, ప్రముఖ కవి, రచయిత
2021 : కళావాచస్పతి డా॥ టి.వి. భాస్కరాచార్య, పరిశోధక కవి, నటుడు, దర్శక నిర్మాత, రచయిత
కపిలవాయి కిశోర్‌బాబు-భార్గవదేవీల సాహిత్య పురస్కారం
పురస్కార గ్రహీతలు
2020 : మహమ్మద్ జహంగీర్, ప్రముఖ కవి
2021 : శ్రీమతి కడుకుంట్ల వీణారెడ్డి, ప్రముఖ రచయిత్రి, కథకురాలు
సభాధ్యక్షులు:
డా॥ శ్రీరంగాచార్య, పూర్వ ప్రధానాచార్యులు, ఓరియంటల్ కళాశాల, పాలెం
ముఖ్య అతిథి:
శ్రీ జూలూరు గౌరీశంకర్, అధ్యక్షులు, తెలంగాణ సాహిత్య అకాడమి
విశిష్ట అతిథులు:
ప్రజాకవి శ్రీ గోరటి వెంకన్న ఎం.ఎల్.సి.
శ్రీ ఆయాచితం శ్రీధర్, అధ్యక్షులు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్
జస్టిస్ ఏ. రామలింగేశ్వర రావు, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తులు
శ్రీ యన్. బాలాచారి, కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి
శ్రీ మామిడి హరికృష్ణ, సంచాలకులు, తెలంగాణ భాషా సంస్కృతిక సంస్థ
ఆత్మీయ అతిథులు
శ్రీ బైసా దేవదాసు, సంపాదకులు, 'నేటి నిజం'
డా॥ గున్న రాజేందర్ రెడ్డి, అధ్యక్షులు, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రస్థాన్
తేది: 24.12.2022, శనివారం, సాయంత్రం గం॥ 6.00 లకు
వేదిక: రవీంద్రభారతి సెమినార్ హాల్, హైదరాబాద్
సభాసమన్వయం
ఎస్.వి. రఘువీరప్రతాప్
డా॥ కసవ నరేందర్
ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి
ఉపాధ్యక్షులు,
డా॥ కపిలవాయి లింగమూర్తి సాహిత్య కళాపీఠం
కపిలవాయి అశోక్ బాబు
కార్యదర్శి
డా॥ కపిలవాయి లింగమూర్తి సాహిత్య కళాపీఠం

బతుకు తీగలను తెంపేస్తున్నాడు ??

నరుడి అహంకారం అందలమెక్కి
భువిపై విషపు జల్లులను కురిపిస్తున్నాడు
మనిషి స్వార్థ బొంతను కప్పుకొని
విచిత్ర విపత్తులకు పురుడు పోస్తున్నాడు.

పుడమి పై తరువులను తరిగేసి
ఇలపై ఎండిన ఎడారిని పరుస్తున్నాడు
ధరణి ఒడిలో ఒదిగిన గుట్టలను కరిగించి
కాసుల కట్టల గుట్టలను పేర్చుతున్నాడు
పచ్చదనాన్ని హత్య చేసి మానవుడు
అడుగడుగునా పొగ గొట్టాలను నాటేసి
కాలుష్య రొంపుని భూమి పై నింపుతున్నాడు.

అవనికి తనువు నిండా గాయాలను చేస్తూ
విలాసాల ఊయలలో ఊరేగుతున్నాడు
భూమి భూషణలన్నీ బుగ్గి పాలు జేస్తూ
భావి బతుకు తీగలను తెంపేస్తున్నాడు
అన్నం పెట్టే మట్టిని అమ్ముకుంటూ
ప్రకృతిని వికృతి చేస్తున్నాడు.

పరులపై ప్రకోపాన్ని పెంచుకుంటూ
విద్వేష గిటారును మీటుతున్నాడు
కడుపులో కత్తులను పెట్టుకొని
మమతలను మంటల్లో కాల్చుతున్నాడు
చారుణ్యాన్ని కానలలో వదిలేసి మనిషి
ఒంటరి గుహలో కాలాన్ని నెట్టుతున్నాడు

-తాటిపాముల రమేశ్
7981566031

టామి గ్రహించింది

ఒక్కోసారి చికాకు తెప్పిస్తుంది
ఎంత చెప్పినా వినదు
ఎన్ని సైగలు చేసినా ససేమిరా ఒప్పుకోదు
ఏమైతదో అరుస్తూనే ఉంటది
బిపి వుందేమో ఆ పెంపుడు కుక్కకి
చెక్ చేయించాలి?--
గేట్ తీయగానే లోపలికి వచ్చిన వ్యక్తి
మీది మీదికి పోతూ--
ఇక కోపం ఆగక ఒక గుద్దు గుద్ది హాలో?లోకి
లాగి గోలుసుతో కట్టేసిబి
××××
బైట నుండి తీసుకొచ్చిన
చేతి సంచిలో డబ్బు లేదు కత్తి వుంది
"అసలివ్వను, వడ్డిఇవ్వను" అంటూ
పొడిచేసి--
××××××
ముసుగు లోని మోసాన్ని టామి గ్రహించింది
కపటధారి వేషాన్ని ధనస్వామి గ్రహించలేదు

-కోటం చంద్రశేఖర్
9492043348

తారాగణం

ఆ!వె!
హావ భావములతొ హాయిగా నటియించి
జనుల సంతసాన మునుగ జేసి
మాయ రూపు లగుచు మనుగడ సాగించు
నటుల కంజలింతు నయము గాను !

పరులాత్మ లావహింపగ
నర నారీ మణులు నటన నైపుణ్యు లవన్
శిరమొంచి కరము లెత్తుచు
నిరతము వందనము జేతు నిఖిలము లోనన్
నటి :
తల్లిగ చెల్లిగ అక్కగ
ఉల్లములో సంచరించు ఊర్వశి రూపై
ఇల్లాలుగ ప్రియురాలిగ
చల్లని సౌభాగ్యవతిగ చాన నటించున్
నటుడు :
తమ్మునిగ అన్నయ్యగ
యిమ్మహిలో కన్నతండ్రి ఇరుగై పోరుగై
అమ్మాయి నిచ్చు మామగ
కమ్మని కాంక్షల మదనుడు కాడె నటుండై

-రసప్రవంతి
కావ్యసుధ
7075505464/
9247313488

వజ్రకవచ ధీమా

అరుచికే కదా పరంధాముడు
సైతం పరవశించి అమృత
సమమైన అమ్మ చేతి చలవకే
యశోదమ్మ ఇంట తచ్చాడింది...

భూమి మీద పడీ పడగానే
వజ్రకవచ ధీమాలను కలగజేస్తుంది ...
చిన్నపాటి సుస్తీ పలకరించినా
ఘా మంత్రంలా పని చేస్తుంది ....

చిన్ని చిన్ని బాల్యంలో ...
మాటల తోటలో విహరించలేని
వయసులో... మన ఆకలి దప్పుల
అలారం అంతా అమ్మ చేతి చలవే ...

పెరిగి పెద్దయినా సరే ...
అలుపు సొలుపుల్లో... ఆటల
బాటలలోనైనా.. ఒక్కసారి "అమ్మ"
అంటూ నిట్టూర్చితినే...ఆయాసమైనా ...
తగిలిన గాయానిమైనా... అమ్మ చేతి
చలవ ఔషధ లేపనమై
అమృతమయమౌతుంది ....

తల్లడిల్లే తనువైనా ...
తండ్లాడే హృదయమైనా...
ఆనందాల కోవెలయిపోతుంది
అమ్మ ఒడిలో తలవాల్చగనే...

సమాధానాలు కరువైన కోటి
ప్రశ్నలు నిండిన మానసమైనా ...
అమ్మను తలుచుకుంటే చాలు
గుండె కుదుటపడే కుందనమే ...

-నగునూరి రాజన్న
8332963129

చెలిమి మొలకలు

నాకూ ఉందొక పూదోట
విశాలంగా ఆకాశమంత....
నిత్యం సంతోషాల పంట
నా జీవితానికి సరిపోయేంత
ఆ సేద్యం పేరు స్నేహం.....

నేను
నాటింది నిస్వార్థపు విత్తులు...
స్నేహ హస్తాన్ని అందించినట్టు
మొలిచాయి చెలిమి మొలకలు
దినదినం పెరుగుతూ వేసాయి
మమతల మారాకులు....

నిత్యం
చిరునవ్వులను దోస్లిళ్లతో
చిలుకరిస్తూ...
అసూయ,అపార్థాల
కలుపు ను తీస్తూ వచ్చాను...
స్వచ్ఛమైన స్నేహపు పాదులు
ఎదగాలని...

శిశిరాలు ఎన్నో ముగిసాయి
వసంతాలు ఎన్నో గడిచాయి
మొగ్గలుగా మొదలైన స్నేహాలన్నీ
విరబూసిన కుసుమాలై...
ఎన్నడూ విడిపోనంతగా
చెలిమి పందిరిపై లతల్లా
పెన వేసుకున్నాయి....

నేనిప్పుడు స్వచ్ఛమైన
మైత్రివనంలో విహరిస్తున్నాను...
ఎన్నడూ వసి వాడని
స్నేహపు సుగంధాలలో
తేలియాడుతూ..,ఆనందంగా

-కళావతి కందగట్ల
9948263004

జన జీవనంతో ముడిపడిన కామెడీ కథలు



ఈ కథా సంపుటి రచయిత పోట్లూరు సుబ్రహ్మణ్యంగారు విద్యాధికులు. మూడు ఎం.ఎలు ఒక డిప్లొమా (ఫిల్మ్ రైటింగ్) చేసారు. 10 కథా సంపుటులు 2 నవలలు తన ఖాతాలో వేసుకున్నారు. నాటి విజయ, యువ, జ్యోతి, నుండి నేటి ఆంధ్రజ్యోతి సాక్షి వంటి పలు పత్రికలకు వ్రాసారు. కొన్ని కథలు హిందీ ఒరియాలాంటి ఇతర భాషల్లోకి అనువదించబడ్డాయి. ప్రముఖ సినీగేయ రచయిత భువన చిత్రగారు **"శ్రీ పోట్లూరు వారు కథా వస్తువు ఎంపికలో జాగ్రత్తను చూపటమే కాక కథను నడపటంలోను చాలా శ్రద్ధను చూపుతారు. ఏ కథా మనల్ని మధ్యలో ఆపదు. ఆ ఒడుపూ వేగం మనల్ని ఆగనివ్వవు"** అంటూ "కథ ఏదైనా చెప్పే విధానంలో కొత్త దనం ఉంటే అది తప్పక పాఠకాదరణ పొందుతుంద"ని కితాబిచ్చారు. వీరికథలు నవలల మీద పరిశోధించి ఎంఫిల్ పిహెచ్‌డి పట్టాలు పొందా లంటే రచయిత కథలు/ నవలలలోని సామాజిక ప్రాయోజికత ఏమిటో అవగతము చేసికొనవచ్చును.

సాహిత్యంలో కామెడీ కున్నంత ప్రాధాన్యం ఇంతా అంతా కాదు. ఇక సినిమాల్లో, పాయసంలో పలుకల్లా హాస్యం లేని 'బొమ్మ' ఆడదు. నిజ జీవితంలో కూడా 'విట్టి'గా చెప్పగలిగే వాడే గట్టి రచయిత. ఏ రసాన్నయినా పాఠకులు కొంతసేపు మాత్రమే భరిస్తారు. కాని హాస్యరసం ఇందుకు మినహాయింపు. 'పంచ్' లాంటి ఇంగ్లీషు హాస్య పత్రికలు వందేళ్ళు పూర్తి చేసుకున్నాయంటే, హాస్యం- అదే- కామెడీకున్న ప్రాముఖ్యత, జనాదరణ ఇట్టే అర్థం చేసుకోవచ్చును. నవ్వు నాలుగిందాల మేలు. నవ్వించాలి గాని నవ్వుల పాలు కావద్ద న్నారు మన పెద్దలు. ఆరోగ్య రిత్యా కూడా హాస్యం గిడసబారిన జీవితాల్లో కూడా పూలు పూయిస్తుందంటారు వైద్యులు.

అట్టమీది బొమ్మను చూడగానే పాఠకులకు తెలుస్తుంది ఈ రెండు డజన్ల కథలు కొబ్బరి నీరులా స్వచ్ఛంగా తేటగా ఉంటూ 'చలువ' చేస్తాయని. ఇంతేకాదు, ప్రముఖులు గాంధీ నెహ్రూ కలాం లాంటి వారలు హాస్యానికి ఎంత ప్రాధాన్యత ఇచ్చే వారో మొదటి పది పేజీల్లో తెలుసుకుంటాము. సంపుటిలో 18 కథలున్నా యని తెలుసుకుంటాము. వినూత్నంగా ఒక్కో కథలో ఏముందో ఒకటి రెండు వాక్యాలలో "కామెడీ కథలు చదవండి ఇలా.." అన్న సూచిక 'సాంపిల్'గా కథల్ని చిరు పరిచయం చేస్తుంది. పోట్లూరి వారి కథలు తమిళ సినిమాల్లోని హాస్యంలా పగలబడి నవ్వించవు. క్రిందపడి దొర్లించవు. ఈకతో సున్ని తంగా బుగ్గలను తట్టితే కలిగే సున్నితమైన గిలిగింతతో పెదవులు విచ్చు కుంటాయి. మనసు 'ఈక'లా తేలిక పడుతుంది.

సుబ్రహ్మణ్యం, గారి హాస్య ప్రియత్వం కథా కథన చతురత మొదటి కథ 'సకల కళావల్లభుడు' తోనే తెలుసుకుంటాము. కథలోని నాయకుడు 'సంగీతరావు సకల కళా వల్లభుడు' అన్న ఎత్తుగడతో పరిచయం కాగానే, ఆయనలో 64 కళలున్నాయని, అందుకే ఆ పేరు వచ్చిందనుకుంటే పాఠకుడి కాలు పప్పులో.. సారీ.. తప్పులో పడ్డట్లే.. "ఆయన కళలే వేరు".. అంటాడు రచయిత. ఆ వేరు కళల తీరు ఏమిటో చదువూతున్న కొద్దీ అర్థం అయి "పాపం సంగీతరావు" అనుకుంటాము. సంగీతరావు భార్య నీలవేణి ఆ ఆదివారం బ్రేక్ ఫాస్టుకు శర్మగారిల్లు, మధ్యాహ్న భోజనానికి అలివేలు ఇంటికి, రాత్రి భోజనానికి రషీద్ ఇంటికి ప్లాన్ చేస్తుంది. శర్మగారు నిగనిగలాడే జిలేబీలు, జీడిపప్పు ఉప్మా, ఇడ్లీ చట్నీలు వడ్డిస్తాడు. అలివేలు గారెలు, బూరెలు గుత్తి వంకాయ కూరా.. మరెవో టేబిల్ మీద అమర్చుతుంది. రషీదు ఇంట్లో భారీ మెనూ ఉంటుంది. పెద్ద ప్లేట్ల నిండా నేతితో చేసిన లేత పొట్టేలు మాంసం బిర్యాని అమర్చుతుంది. భార్యా పిల్లలు ఆ పదార్థాల మీద దాడి చేస్తారు. కాని మన సంగీతరావు ఒకే ఒక ఇడ్లీ చక్కెర లేని కాఫీ లంచిలో సాంబారు రసంతో సరిపెట్టుకుని డిన్నర్‌లో ఉర్ది మజ్జిగ అన్నం మాత్రమే ముట్టుకుంటాడు. కథ చివరకు వచ్చేసరికి సంగీతరావుకి షుగర్ బిపి చర్మ వ్యాధి లాంటి కళలున్నాయని ఇవే ఆయన 'కళలు' అని తెలుసుకుంటాము. సకల వ్యాధుల కళలు నిక్షిప్తం చేసికున్న సంగీత రావుమీద పాఠకులకు కూడా బోడిడంత జాలి కలుగుతుంది.

రెండవ కథ 'వీరాంజనేయులు రామాంజనేయులు'లో కామెడీ ఉంది. కరుణ ఉంది. కొసమెరుపు ఉంది. రీటయిరయిన రామాంజనేయులికి 'హాయ్' అనేముద్దు పేరుగల వానరుడు స్నేహం. రామాంజనేయుడు ఇంట్లోని చెట్ల మీద దానికాపురం.. వాహ్యాళి వగైరాలకు వీరాంజనేయులు ఆమాంజనేయులుతో వెళ్ళి నరదాగా గడిపేవాడు. ఒకనాడు రామాంజనే యులు కోపంతో భార్యను దండించి పెరట్లోకి కొబ్బెర చెట్టు క్రిందకు వెళుతాడు. కొబ్బెరకాయ ఒకటి ఆయన బట్టతల మీద పడి బొప్పి కడుతుంది. దాంతో 'హాయ్' మీద కోపం తెచ్చుకుని అలుగుతాడు. భార్యను దండించినందుకు వీరాంజనేయులు శిక్షించాడని అపోహపడతాడు. తర్వాత తెలుస్తుంది రామాంజనేయులు మీదకు కోతి కొబ్బెరకాయ విసరలేదని, అది 'ఇరియోఫిడ్' వల్లనే కాయ తొలుచు పురుగు వల్లనని తెలుస్తుంది. ట్రాజేడీగా నడుస్తోన్న కథ కామెడీయై తిరిగి వీరాంజనేయులు రామాంజనేయులు సఖ్యతగా ఉంటారు. సాఫీగా నడిచే కథ, కథనం రెండూ పాఠకుడికి నచ్చుతాయి.

మిగతా కథలన్నీ సాఫీగా నడుస్తూ వొడుపు, వేగం మనల్ని ఆగకుండా చదివిస్తాయి. ఎంపికలో చూపిన శ్రద్ధ నడపటంలో చూపిన జాగ్రత్త పాఠకులను ఆకట్టుకుంటాయి. ప్రఖ్యాత సాహితీవేత్త ఇందూరమణగారి మాటల్లో ఇవి 'కామెడీ కథలేకాదు నవ్విస్తూనే కవ్విస్తాయి. తెలీకుండానే కన్నీళ్ళు తెప్పిస్తాయి. ముందు ముందు కూడా ఇంకా మంచి కథలు రాయాలని అభినందిద్దాం.

ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, నవోదయ పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

- కూర చిదంబరం
సెల్: 8639338675

పుస్తక సమీక్షలు

హాయిని గొలిపే 'హరిణ వల్లరి'..!

వివిధ ప్రక్రియల్లో విలక్షణమైన ప్రతిబను ప్రదర్శిస్తున్న నెల్లూఉకు చెందిన కవయిత్రి ఎం.వి. ఉమాదేవిగారు ఈ మధ్య ఓ గజల్ సంపుటిని ప్రకటించారు. హాయిని గొలిపే విధంగా.. తమదైన శైలిలో చక్కని భావధారతో రూపుదిద్దబడిన 'హరిణ వల్లరిలోని గజల్లకు జీవం పోశారు. "హరిణవల్లరి" పేరుతో ఉమాదేవిగారు మనకు అందించిన ఈ గజల్ సంపుటిలో ఆమె యొక్క లోక పరిశీలనను.. సామాజిక చింతనను.. చక్కని భావుకతతో పాటు చిక్కిని ఆలోచనలు చక్కగా కొలువుదీరడాన్ని అడుగడుగునా చూస్తాం.. ఆయా ప్రక్రియల్లో.. ఆమె ప్రదర్శించిన సృజనాత్మక ప్రతిభకు.. వివిధ సాహితీ సంస్థలు.. అంతర్జాల సమూహాలు ఆమెను 'కవితా భూషణఖ' మణిపూసల కవివరేణ్య, మెరుపు కవిరత్న, సాహితీ విశిష్ట చక్రవర్తిని వంటి బిరుదులతో సత్కరించడం విశేషం!

వచన కవిత్వంతో పాటు షోడోలు- సమ్మేళనాలు నానీలు, మెరుపులు, పద్యాలు- కథాని కలున.. మణిపూసలు రాసి అందరి దృష్టినాక ర్షించారు. ప్రత్యేకించి 'గజల్' ప్రక్రి యపై దృష్టిసారించి.. అభిలషణీయమైన ప్రగతిని సాధించడం స్వాగతిం చదగింది. కవయిత్రి ఎం.వి. ఉమాదేవిగారు పెద్దగా చదువుకోలేదని స్వయంగా.. వినమ్రంగా ప్రకటించు కోవడం ఆమె ఉత్తమ వ్యక్తిత్వంగా భావించవచ్చు.

గజల్ ప్రక్రియలో ప్రవేశించి.. కొంతమేరకైనా అవగాహనను పెంపొందించుకుని...గజల్ రచనలో..తమ సృజనాత్మకతను చాటు కుంటూ.. "హరిణవల్లరి"ని తీర్చిది ద్దారు. ఆలోచనాత్మక ముఖచిత్రంతో ముస్తాబై వచ్చిన ఈ సంపుటిలోని గజల్‌లలో.. కదళీ ఫలాలు కదిలే పదాలు మెదిలే భావన నా తెలుగు అంటూ ఆమె ప్రకటించడాన్ని.. సరళీ స్వరాలు నడిచే వనాలు మదిలో మోహన నా తెలుగూ అంటూ వినమ్రంగా విన్నవించుకోవడాన్ని చూస్తాం..

ఆడంబరమే మనకు ఆదర్శం భారతీయ మహోన్నతమే అంటూ మౌనంగా ఉంటూనే తరువులా పది మందికి సాయపడాలని ఆకాంక్షించడం బావుంది.

ఎందుకు గజల్ ప్రక్రియ అంటూ మిశ్రగతిలో రాసిన గజల్‌లో నిదురలేనిది నీదు తలపని నింద వేయుట తగినదా.. మూగ బాసలు కల్లలైనవి కరములందుట ఎందుకు అంటూ కొనసాగించిన తీరు అభినందనీయంగా ఉంది.

'ముషాయిరా గజల్' శీర్షిన రాసిన గజల్‌లో.. కలువలతో తొలిపూజలు జరిపెదమా చెలీ నేడు.. చెటవముతో వరలక్ష్మిని కొలిచెదమా చెలీ నేడు అంటూ ప్రారంభించడం బాగుంది.

తొలి ప్రేమల మాలికలను ముడిచిందీ గురుతుందా.. వలసంతా కలబోసుకు మురి సిందీ గురుతుందా.. పెదవి మీద పుట్టు మచ్చ నేనైనా కాకుంటిని.. తాం బూలం 'ఎరు పంతా తడిమిందీ గురు తుందా.. చీకట్లో వేకువనై చెలియా నిన్ను కాచుకుంటూ.. తుషారికల మెరుపంతా హేమంతం చివరితోనూ అంటూ రమణీయ భావాలతో ఈ గ్రంథంలోని 59వ గజల్‌కు జీవం పోశారు.

58వ గజల్‌లో గుండెల్లో భావాలను దాచుతున్న కనురెప్పలను.. శోక జలధి ముత్యాలను జార్చుతున్న కను రెప్పలను చక్కగా ఆవిష్కరించారు.

56వ గజల్‌లోనూ పాఠకు లకు గిలిగింతలు పెట్టే విధంగా కవయిత్రి ఉమాదేవిగారు తమ రచనను కొనసాగించారు. చూపుల గాలం వేసేందుకు చెలియా.. మాటల వలనే విసిరేందుకు చెలియా.. కాఫిరు వంటూ అల్లరి నవ్వులు నీవై.. వలపుల జాడలు తెలిపేందుకు చెలియా అంటూ అందమైన భావాలకు చోటు కల్పించారు.

'వాలుజాడ'ను గజల్‌లో బంధిస్తూ.. 55వ గజల్‌ను తీర్చిదిద్దారు. అల్లికలో సహన ముంది ఆమెలోను అతిశ యమే..ప్రియభావం నయాగరం అలుముకుంది వాలుజడ అం టూ రాసిన పంక్తులు బాగు న్నాయి.

'గోరింట'ను వర్ణిస్తూ మరో గజల్ రాశారు. నవవధూవు మదిలోన నాట్యమే చేసింది విరహాల వెన్నెలలు కాచింది గోరింట అంటూ

గోరింట సొబగులను అక్షరాల్లో ఆవిష్కృతం చేశారు.

'ముషాయిరా' శీర్షికతో రాసిన రచనలు.. ప్రణయ వీణ పెళ్ళిచూపుల కాలమందే మోగెలే.. కుదరదేమో సందియ ములే వదిలినందుకు నవ్వనా అని కొనసాగించడం బాగుంది.

నాన్న మనసును ఆవిష్కరిస్తూ రాసిన గజల్‌లో.. ప్రతిఫలమే ఆశించని పరమ పురుష లక్షణాలు.. సహనాన్నీ సహాయాన్ని నేర్పు తుంది. నాన్న మనసు అంటూ నాన్నను ఉన్నతంగా చిత్రించారు.

అనురాతపు నివేదనే నా మనసు నీకెపుడూ కొలిచిన నా పాపిటలో ఉదయించే నీ గురుతులు అంటూ 42వ గజల్‌కు రూపమిచ్చారు.

శ్రమజీవికి అలసటలో చెమటలనే అతికినవీ నుదిటపైన సిరి మెరుపులు అలకగలవు ముంగురులోయ్.. సొట్టబుగ్గలో నిలిచే పసిపాపల అందాలవి.. ఉంగరాలు తిరిగి మరీ ఉరకగలవు.. ముంగురులోయ్ అంటూ ముంగురులను విభిన్న కోణాల్లో ఈ గజల్‌లో అందంగా దృశ్యమానం చేశారు.

ఇలా ఇందులోని గజల్‌ల లోని అనేక పంక్తులు ఉదహరించడానికి యోగ్యంగా ఉన్నాయి. కొంత మేరకైనాగతి, లయ తప్పకుండా రాసిన ఈ గజల్‌లు గానం చేసుకోవడానికి వీలుగా ఉన్నాయి. లోక సహజంగా.. చమత్కారాన్ని జోడించి రాయడంలో కవయిత్రి ఎం.వి. ఉమాదేవిగారు సఫలీకృతులైనారు.

అక్కడక్కడ కొన్ని గజల్‌లలో నియమాలు నడక తప్పినప్పటికీ కవయిత్రి భావధారపు అభినందించితీరుతాం. హాయిగా చదువుకునేందుకు వీలుగా ఈ గ్రంథాన్ని తీర్చిదిద్దిన ఉమాదేవిగారికి శుభాకాంక్షలు తెలియజేద్దాం. ఆమె గజల్ ప్రక్రియపై మరింత అవగాహనను పెంచుకుని.. మరిన్ని బలమైన గజల్‌లు రాయాలని కోరుకుందాం..

ప్రతులకు:
ఎం.వి. ఉమాదేవి
సెల్: 78423 68534

- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

మాయమైపోయిందోయ్.. !!

సంస్కారం నేర్పని
పుస్తకాల బరువుల మోతలతో..

అర్థంకాని భాషామాధ్యమంలో
ఊకదంపుడు సిలబస్సులతో..

ర్యాంకులు ఆశపెట్టి
పరుగెత్తించే పరీక్షావిధానాలతో..

ఫీజులంటూ సొమ్ములు దండుకునే
చదువుల బలిశాలల్లో..

రేపటికోసం గట్టి పునాదులు వేయలేని
మేధావుల వ్యాపారాలలో..

ఆటపాటల్లేని కార్పొరేట్ పాఠశాలల
మాయా ప్రపంచంలో..

అమ్మానాన్నలు కట్టుకునే
అత్యాశల కలల సౌధాలలో..

పోటీ ప్రపంచం అంటూ
తనతోటి వారికి దూరమైపోతూ..

పసి వయసులకు
తానెవరో తెలియకుండానే..
మాయమైపోయిందోయ్ బాల్యం..!!

-పేరిశెట్టి బాబు
9247170800

ఆకలి ఆకలి!

అతడూమనలా మనిషే
ఉదయాన్నే లాగిస్తున్నాడు
ఆకలి ఆకలి
కనిపించలేదు కంచం
తినడమొక్కటే ఇప్పుడతని ప్రపంచం
ఆకలి ఆకలి
మెతకుమెతుకు
గబగబా
ఆకలి ఆకలి
కుర్చేమో చెత్తకుప్ప
కంపుగాలే వింజామర
ఆకలి ఆకలి
పప్పు లేదు, చారు లేదు
పచ్చడిలేదు,పెరుగులేదు
ఆకలి ఆకలి
బాధ అంటే,లోకమంటే తెలియదు
రూపాయంటే,రూల్సంటే తెలియదు
ఆకలి ఆకలి
ఉరుకులపరుగుల్లో ఊరిజనం
చెత్త లోని అంట్లే
అతని విందుభోజనం
ఆకలి ఆకలి
మతిస్థిమితం లేని
మా ఊరి బిచ్చగాడు
ఆకలి ఆకలి
ఉదయం క్లిక్ మన్న దృశ్యం
గుండె కల్కుమనే దీన దృశ్యం
ఆకలి ఆకలి
నా కండ్లలో చెలిమలు
నా కాళ్లకు సంకెలలు
ఆకలి ఆకలి.

-రమేశ్ నల్లగొండ
8309452179

వీరులెపుడూ.... పరాజితులు కారు

వీరుని సమాధి రోధిస్తున్నది
పోరు దారిలో వీచే స్వార్థపు గాలి
మేను లోని సిద్ధాంతాలను
మోసుకెళ్తున్నందుకు.

ప్రాణప్రదమైన విలువలు
పతన జాతరకు సిద్ధమై
అమరుల త్యాగాలను పోటీపడి
ఊరేగిస్తున్నందుకు.

గుండెలవిసేలా దిక్కులు పిక్కటిల్లెలా
అలక్ష్యంతో నిర్మించుకుంటున్న
శక్తి సౌధాలు.
విధేయత మరిచిన నాటకాలు.

ముసుగులో నమ్మకాల ఆశలన్నీ
ఆవిరిగా మారుతున్నందుకు.

వీరుని సమాధి రోధిస్తున్నది
విజయమంటే విలువలను
వలువలుగా వదిలిపెట్టడమా ?
నీ మార్పుకు కారణం అయిన
మనసే నిన్ను ప్రాధేయపడడమా ?

పోరాట పొత్తిళ్లలోంచి
గెలుపుగీత మవ్వడమంటే
అసమర్థుల సంగీతానికి
నృత్యం చేయడం కాదు.

లోకమంతా నాలుకై పలికిన వీరుడు
ప్రాణమంతా
సిద్ధాంత శ్వాసలను
నింపుకున్న యోధుడు.
కన్నీరు కార్చడం విజయ లక్ష్యం కాదు.

నాలుకపై మోసపు కత్తిగాట్లతో
ఘనమైన ప్రాణాల ఆశలను
కత్తిరించడం విజయ గమనం కాదు.

అన్ని దిక్కులు తానై
వందనాలు అందుకున్న పాదం.

మరణశయ్యపై పడినప్పటికీ
ధైర్యాన్ని వీడని ఆత్మస్థైర్యం.

ఎత్తిన పిడికిలిని దించక
పోరాట పటిమను అడుగడుగునా
రంగరించిన వీర హృదయం.

దిక్కుతోచక అలమటించడం
ఏ త్యాగానికి అర్థం?

వీర హృదయాలు ఎప్పుడూ
ఆత్మవంచితులు కావు.

వీరులెప్పుడూ పరాధితులు కారు.
గెలుపంటే నమ్మకాన్ని తుంచటం కాదు
ద్వేషాగ్నులు రగల్చడం కాదు.
మనసులో
ఆనంద దివ్వెలు వెలిగించడం.
గెలుపంటే ....
ఆశయాల గమనంలో
వెలుగు దివిటీలు గా మారడం.

-సిరిసిల్లా
గఫూర్ శిక్షక్
9849062038

విన్నపం

మనసా విన్నావా
మాట్లాడే ఓ మనసా విన్నావా
ఎందుకు నీకు అహంకారం
ఎవరికీ కనిపించని నీ రూపంలో
దాచినావు
ఎన్నో ప్రతిస్పందన రంగులను
కన్నులు చాటున దాగిన కన్నీళ్ళతో
సావాసం మర్చిపోయావా
నీలోని దాగిన బాధను
పంచుకోవడం లేదు ఎందుకో మరి
ఓసారి మంచితనము
ఓసారి తుంటరితనం
మరోసారి అమాయకత్వం
నిశ్శబ్దంగా ఉంటావు
మౌనంగా సవ్వడి చేస్తావు
నీ గురించి నీకైనా తెలుసునా
నీతో వెంటాడు జ్ఞాపకాలతో
కాలంతో సహవాసం చేస్తూ
చెదిరిపోని నీ చిరునవ్వుకు
నేను దాసోహం
నీవే నాకు ఆదర్శం
నిత్యము నీవే నా వెంట ఉంటావుగా
రమ్యమైన మనసా విన్నావా
నా చిన్ని ఈ విన్నపం

-వై.రమ్య
6305408398

చచ్చిన ఈగలు

గమ్యాట్ ర్యాట్
ఆలోచన పీక్కుంటోంది
చావదు బయట పడదు!

చిమ్మచీకటి వేళ్ళ
వెచ్చని వెలుతుర్ల కింద
మాట పెగలని
అనురాగం దగ్ధమౌతుంది.

ఊహల్ని అందుకోలేక
కాళ్ళు చతికిలబడతాయి.

ఉన్నట్టుండి
పేరాగ్రాఫ్ మారుతుంది
వాక్యం కన్నా ముందే
ఫుల్ స్టాప్ తొందర పడుతుంది.

మనిషిని మడుస్తూ
కాలం తన పని తాను
చేసుకు పోతుంది.

చాయ్ కప్పులో
పొగలు రాలి అట్టు కడుతుంది
దాని కింద
చచ్చిన ఈగలు తేల్తాయి.

-కేతిరెడ్డి యాకూబ్ రెడ్డి
9989584549

గమ్యం కోసం...

అడుగులు
తడబడుతున్న
అపజయాలు
ఎదురవుతున్న
కష్టాలు కారు
చీకట్లులా కమ్మేస్తున్న
గెలుపు దారుల్లో
విశ్రమించే కృషీవలుడు వలే
సాగిపోనివ్వాలి జీవితాన్ని
గమ్యం కోసం !!

మనసుకు తాకిన
అవమానాన్ని
దేహానికి తాకిన
గాయాలన్ని
కలలు కన్నా కలలని
కరిగిపోయిన కలలని
గడిచిన గతాన్ని
గత జ్ఞాపకాలన్ని
తలసుకొంటు
తలసుకొంటు
ఆగిపోనివ్వకు జీవితాన్ని
సాగిపోనివ్వు జీవితాన్ని
గమ్యం కోసం!!

-లక్ష్మీ శ్రీనివాస్
9676601192

మణిపూసల రామాయణ కావ్యం- ఆశుకవి టి. ఆశీర్వాదం ప్రతిభ

'మణిపూసలు' అనే కవిత్వ రూప ప్రక్రియలో శ్రీ మద్రామాయణాన్ని కవి శ్రీ టి. ఆశీర్వాదం, దాదాపు 1400 మణిపూసలు కూర్చి ఛందోబద్ధంగా మణిపూసల రామాయణంగా కావ్య రచన, చేసారు. రంగారెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, 'కవి భూషణ' 'ఆశుకవి అయిన టి. ఆశీర్వాదం, చదువరుల హృదయా లను ఆకట్టుకొనే భావ, కవితా రీతిలో సరళంగా, సుందరంగా గానానికి ఆమోద యోగ్యంగా రచించి, చరితార్థుడయ్యారు. మాత్రా నియమంతో పాటు ప్రాసతో తీర్చిదిద్దిన ఈ కృతి మనస్సు రంజింపచేసే భావాల శైలికి ఆలవాలంగా మనస్సుకు హత్తుకుంటోంది.

"అష్టైశ్వరముల కన్న
అంతులేని సిరులకన్న
స్వర్గలోక సుఖముకన్న
జననీ జన్మభూమి మిన్న" "జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి" వంటి సంస్కృత శ్లోకాలను యింత సులభమైన పదజాలంతో సామాన్యులు, విద్యార్థులు పండిత పామరులందరూ అర్థం చేసుకొని ఆనందించగల కవిత్వ రూపంలో ఆశీర్వాదం, వెలువరించారు. ప్రార్థన, బాల అయోధ్య అరణ్య కిష్కింధ, సుందర, యుద్ధకాండలు, మంగళహారతి, ఫలశ్రుతి సంప్రదాయ విశిష్ట కావ్యంగా కవి, అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణ తరుణంలో శ్రీరామగానం చేసి ధన్యత సాధించారు. 275 మణిపూసల పద్యాలతో సమాప్తమైన ఈ కావ్యంలో శ్రీరామాయణ కథానుగుణ్యంగా ఫోటోలు జతపరిచారు.

"శ్రీరాముని భార్య సీత
సౌందర్యాల కలబోత
అప్సరసలకన్న మిన్న
యైన, సకలగుణ సమేత" అంటారు కవి అద్భుతంగా మణిపూసలలో వినూత్నంగా అలతి అలతి పదాల మాధుర్యంతో శ్రీరామాయణ కథా గానం కవితా రూపకంగా కవి మన కళ్ళకు కట్టినట్టుగా చిత్రీకరించారు.

"మణిపూసల గూర్చెదా రాముని గళమేసెదా" అంటూ కవి **"తన శీలము గొప్పతనము ముల్లోకాలకు విదితము చేయటకే నా సీతకు ఈనాడగ్ని ప్రవేశము"** అంటూ శ్రీరామాయణ మహాకావ్య అంతరార్థాన్ని అభినందనీ యంగా అభివ్యక్తం చేసారు.

ప్రతులకు:
శ్రీమతి శశికళ ఆశీర్వాదం
ఇ.నెం. 4-143, 11/19/1
ఓంనగర్ కాలనీ
కిస్మత్‌పూర్, గండిపేట (మం)
రంగారెడ్డి జిల్లా-500 086
సెల్: 90102 08191

-జయసూర్య
సెల్:9014948336
9394775088

నానీలు

అక్షరాలకు
అత్తరు కాదు
కవిత్వం పూస్తేనే
పరిమళం.

పెదాలను
తాక

బాయ్‌కాట్... (కథ)

అర్ధరాత్రి దాటుతోంది. కీచురాళ్ళు సైతం తమ ఆలాపనకు శుభం పలికిన మలిజాము వేల అది. చాలా కాలము నుండి మూడో నంబరు రైల్వే ప్లాట్ ఫారంపై ఆగి ఓ బోగి ఉన్నది. అది పైన కనిపించే నల్లటి మబ్బుల చీర అంచులో నక్కిన చందమామ కేసి తొంగి చూస్తోంది. అందరు "బాయకట్టు" అంటారు నన్ను అన్నది ఓ స్వరం కదలని చీకటిని చీలుస్తూ ఆ బోగిలో నుంచి? "ఈ రైలు కట్ట దాటి ఓ ఇరవై మైళ్ళు నడిచెల్లాలి నేనుండే గుడిసె కాడికి పోనీకి. నీకి నిఖా చేసుకుంటా" అన్నది మళ్ళీ. ఆ మాటలు విని .. ఆ బోగినుండి ఒక స్త్రీ ఆకారం కిందికి దిగి అక్కడి నుండి కదలిపోబోయింది . "నీకి నమ్మకం లేదా నాపై" భోగి దిగి వెళుతున్న ఆకారము కేసి చూస్తూ అన్న మాట మళ్ళీ బోగి నుండి వచ్చింది . తాను ముందుకు వేసే అడుగు ఆపి..ఆ స్త్రీ నీడ వెనక్కి తిరిగి ఇలా అంది. "సూడు బాయ్య ఈ సీకటిపై ఆన ?.! ఆ ఎన్నెలమ్మ నిన్ను సూసుకుంటాను సల్లంగా అంటే ఈ సీకటమ్మవొగ్గిస్తాదా సెమ్మ!? నాది ఈ సీకటి బతుకేగాదెటి, మెతుకు మెతుక్కి నా బతుకులో యాతనే.'' బోగీలో నుండి ఓ నీడ నెమ్మదిగా కదలి వచ్చి "నీకి నాది హామీ" అని ఆగిన ఆ స్త్రీ నీడ చేతిలో చేయి వేసి పలకింది.

ఒకటో నంబరు ప్లాట్ ఫారంపై రైలు ఆగివుంది. తన నెత్తిపై బేసిన్ లో శెనక్కాయలు బుగ్గాలు పెట్టుకుని జనానికి అమ్మడానికి చూస్తూ ఉన్నది చెంచమ్మ. రైలు వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నది. రైలు ఎక్కే దిగే హడావిడిలో ఉన్నారు జనం. ఎవ్వరూ చెంచమ్మ వంక చూడటం లేదు. తన దొక్కలో పేగు పెట్టె ఆకలి అరుపును అణచడానికి కొళాయిలో నీళ్లు పట్టుకుని తాగింది చెంచమ్మ.. "బోణి అయ్యిందా చెంచి" అని అడిగాడు రైల్వే కూలి శీను. శీను ప్రశ్నకి 'చీకటి పడితే అక్క బోణి అయిపోతాదిలే శీనన్న' అంటూడు స్టేషన్ లో టి అమ్మే గోపి వెటకారంగా నవ్వుతూ. తన బేసిన్ పై వాలే ఈగల్నితన వోణి కొంగుతో తోలుకుంటూ చెంచమ్మ శీను వైపు విసుగ్గా చూస్తుంది. రైలు కదిలింది. క్షణాల్లో ప్లాట్ ఫారం నిర్మానుష్యం అయిపోయింది.

చీకటి పడింది. చెంచమ్మ కండ్లలో నీళ్లుసుడులు తిరుగుతున్నాయి. మారు బేరానికి తెచ్చిన సరుకు అమ్మగా మిగిలింది బేడా.. కాణి.. అని లెక్కించి తన లంగాకు వేళ్ళాడుతున్న చిత్తిలో వేసుకుంటుంది చెంచమ్మ. చిత్తిలో నుంచి పొగాకు కాడని తీసి నలిపి బుగ్గన పెట్టుకు ని ఓ బల్లపై కూర్చుంటుంది. గోపి గాడి మాటల్ని గుర్తు చేసుకుని నిరుత్సాహంగా నవ్వుకున్నది తనలో తాను చెంచమ్మ. కాసేపటికి తాను కూర్చున్న బల్లపైననే పడుకుని నిద్రలోకి జారుకున్నది చెంచమ్మ.

ఎవరో పిలిచినట్టుగా చెంచమ్మ ఉలిక్కిపడి లేచింది. చీకట్లో కలిసిపోతు గాబరాగా అడుగులు వేస్తూ పట్టాలు దాటుకుంటూ వెళ్లి ఒక చోట ఆగింది చెంచమ్మ. అక్కడ చీకట్లో ఒక భోగి దగ్గర ఓ నల్లని ఆకారము నిలబడి చేయి ఊపింది చెంచమ్మ కేసి చూస్తూ. తన కేసి ఊపుతున్న చేయితో తన చేయి కలిపి ఆ చీకట్లో. రైళ్ల రాకపోకలు లేని ఆ రైలు కట్టపై తన అడుగులు వేస్తుంది. ఆ చేయి అందించిన భోజనాన్ని ఆరగించింది చెంచమ్మ. అలా తెల్లారే దాకా ఆ ఆకారంతో కలసి కబుర్ల పూలను పూయించింది చెంచమ్మ.

పొద్దున్నే లేచి తన ఇంటి ముందే మంచంపై బిషానా ప్రారంభించింది చెంచమ్మ. ఇస్కూలు కెళ్లే పిల్లలకు పిప్పరమెట్లు అమ్ముతూ ఉండగా "ఓ చెంచో ఇటురాయె" అంటూ మిద్దె గళ్ళ లచ్చి పిలిచింది చెంచమ్మను. 'ఎండాకాలం కదా కాస్త నీళ్లు తెచ్చి పెట్టవే' అని అడిగింది చెంచమ్మను లచ్చమ్మ. 'అట్టాగే అమ్మగోరూ' అంటూ కడవలతో నీళ్లు మోసి లచ్చమ్మకు సాయం చేసింది చెంచమ్మ. లచ్చమ్మ పెట్టిన చద్దెన్నం తిన్నది.

ఒకనాడు చెంచమ్మ శెనక్కా అమ్ముతూ రైలు దిగుతున్నది. అదే రైలులో ఇంతలో ఒకడు తనను ఎవరో వెనక నుంచి తరుముతున్నట్లు పరుగెత్తుకుంటూ పారిపోతూ ఉన్నాడు. ఆ సమయములో అతడు అనుకోకుండా చెంచమ్మను గుద్దుతాడు. దీనివల్ల చెంచమ్మ రైలు దిగుతూ తూలి నేలపై పడిపోతుంది. చెంచమ్మ తలకు పెద్ద గాయం అయి రక్తం కారుతుంది. అతడు తిరిగి చూసి చెంచమ్మకు ఐన గాయానికి తానె కారణమని తలచి

> "అక్కడ చీకట్లో ఒక భోగి దగ్గర ఓ నల్లని ఆకారము నిలబడి చేయి ఊపింది చెంచమ్మ కేసి చూస్తూ"

బాధపడతాడు. చెంచమ్మను అతడు హాస్పిటల్ కు తీసుకెళ్లి చికిత్స చేయిస్తాడు. చెంచమ్మకు చికిత్స చేయిస్తున్నప్పుడు ఆమెకు వెనక ముందు ఎవరూ లేని ఒంటరి అని తెలుసుకుంటాడు అతడు.

నాటి నుంచి అతను స్టేషనులో కనిపించినప్పుడల్లా పలకరించేవాడు. చెంచమ్మకు అప్పుడప్పుడు తనకు తోచిన బహుమతులనుకూడా అందించే వాడు. ఒక్కోసారి చెంచమ్మను దూరం నుంచే చూస్తూ తన భవిష్యత్తును తన ఊహలలో కలలు కనసాగాడు. ఓనాడు చెంచమ్మ స్టేషనులో ఒక బల్లపై కూర్చుని ఉన్నది.. తన ఎదురుగ్గా ఉన్న ప్లాట్ ఫారంపై రైలు వచ్చి

> "నీ అరాచకాలకు సమాజం ఏనాడో నిన్ను బాయికాట్ చేసింది. నీ లెక్క ఉండే పెనిమిటిని నేను బాయ్ కాట్ చేస్తా"

ఆగి ఉంది. ఎక్కడి నుంచో అతను పరుగెత్తుకుంటూ వచ్చి చెంచమ్మను ఆ రైలు బండి ఎనక్కి చేయి పట్టి తీసుకుని వెళ్లి రైలు బండి ఎనక తానూ రాసినది చూపిస్తాడు చెంచమ్మకు. చెంచమ్మ మౌనంగా అక్కడి నుండి చదవకుండా వెళ్ళిపో తుంది.

చెంచమ్మ అలా ఎందుకు వెళ్లిందో అర్థం కాదు అతనికి ఆ క్షణం. ఓ సాయంత్రం తన మనసులో ఉన్న తన ప్రేమను చెబుతూ ఓ ఉత్తరం రాసి చెంచమ్మకు ఇస్తాడు అతడు. ఉత్తరం తెరచి చూసి తిరిగి ఇచ్చేస్తుంది అతనికే చెంచమ్మ. అతని కేసి చూస్తూ కన్నీళ్లతో నేను చదువుకోలేదు అని చెప్పి వెళ్లిపోతుంది.

కొంత కాలానికి బాయ్ కాట్ చెంచమ్మను నిఖా చేసుకుంటాడు. "నాకీ మొదటి బేగం జబ్బుచేసి మర్గయితి. అభితక్ నాకి నిఖా ఆలోచించలేదు "నీకి చూసే వరకు" అని చెబుతాడు బాయికాట్ చెంచమ్మతో. "నా పేరును నేను మరచి పోయి చాన్నాళ్లయింది. అయినా నీకు నిఖా చేసుకున్న నీకి నా బేగం. ఖుబ్ సూరత్" అంటూ ఆరాత్రి పాటలు పాడుతాడు బాయికాట్ తన గుడిసెలో చెంచమ్మను చూస్తూ. "అయినా నాది చీకటి పనే నా పేరుతో ఈ దునియాకు పనిలేదులే" అంటూ చెంచితో కబుర్లు చెబుతాడు తనతో గడిపే ఆ మొదటి వెన్నల రేయి. "నేను రైళ్లలో దొంగతనాలు చేస్తా .. ఇదిగో నీకి నెక్ లెస్సు" అంటూ బాయ్ కాట్ చెంచమ్మకు అలంకరిస్తాడు. ఆ రోజు ఇది కొట్టేసి పోతూనే నీకి ప్రేమలో పడిపోయా అని నవ్వుతాడు బాయ్ కాట్ చెంచమ్మతోచెప్పి.

సాయంత్రం నాలుగు గంటలు పోలీసోళ్ళు తలుపులు బాదుతున్నారు. చెంచమ్మ తన ఇంటి తలుపులు తెరచింది. లోపలికెళ్ళి పడుకుని ఉన్న బాయ్ కాట్ ని పట్టుకుని లాక్కెళ్లి పోలీసు వాను ఎక్కించారు కానిస్టేబుళు. "పోలీసు బాయ్య ఒగ్గేయ్యండి ఈ తూలికి ఇంట్లో గింజలు నిండుకున్నాయి. నా ముగ్గురు పిల్లల కడుపు కాల్తాది. ఆకలికి దయ చూపించండని" పోలీసోల్ల కాళ్లావేళ్లా పడింది చెంచమ్మ. "ఈడి దోపిడీకి జనాలు చస్తున్నారు అక్కడ. అయినా ఇదేమైనా మొదటి పాలే? ఈడీకి నీకు చల్'' అంటూ చెంచమ్మను విదిల్చుకున్నారు కానిస్టేబుళ్లు. "వ్యానులో నుంచి ఈ సాలె గానికి ఎన్ని మార్లు బొల్కే బాద్ బి బుద్ధి లేదు. నేను జైలు నుండి రాని ఫిర్ దేఖేంగే ఉస్కో" అంటాడు బాయికాట్. పోలీసువాను అక్కడి నుండి కదిలి వెళ్ళిపోతుంది.

బాయ్ కాట్ కు అతను చేసిన దోపిడీకి న్యాయస్థానం ఆరు నెలల జైలు శిక్ష వేస్తుంది. బాయ్ కాటు జైలు శిక్ష ముగించుకుని బయటకు వస్తాడు. తన సావాసగాళ్లు చెంచమ్మచేసే చీకటి పనులను గురించి చెబుతారు బాయ్ కాట్ తో.. బాయ్ కాట్ ఆ మాటలు విని బాధ పడతాడు. తన గుడిసెకు వస్తూ దారిలో కల్లు తాగి వస్తాడు బాయ్ కాట్. గుడిసెలో ఉన్న చెంచమ్మను చితకబాదుతాడు బాయ్ కాట్. "నీ దోస్తులు చెప్పేవి నమ్మొద్దని" బతిమాలాడుతుంది బాయ్ కాట్ ని చెంచమ్మ. "నేను దొంగనే కానీ నీకి పై ప్రేమ ఉంది నాకి నీతి ఉంది" అంటూ బాయ్ కాట్ రోదించాడు. "నా పిల్లలకి చుస్కో సరిగ్గా. నీకి ఇలాంటి చీకటి పనులు మానుకో, మానుకోకుంటే లెక్కలు వేరే" అని బాయ్ కాట్ బెదిరిస్తాడు చెంచమ్మను.

తన స్థితిని తలచి బాయ్ కాట్ తన ఇద్దరు కూతుళ్ళకు కష్టపడి వాళ్లకు నిఖా చేస్తాడు. తరవాత కొద్ది కాలానికి ఓ రోజు ఊరి పెద్ద బస్టాండులో తన దోస్తు మస్తానును కలసి బాయ్ కాట్ ఇలా చెబుతాడు. "నీకి మొత్తం తెలుసు నాగురించి. నేను దొంగనే. నాకి ఏ పని రాదు. చిన్నప్పటి నుండి ఇదే అలవాటైంది. నా మూడో కూతురుకు నీ కొడుకు ఫిరోజ్ తో నిఖా షురూ చేయమని'' ప్రాధేయపడతాడు. మస్తాను ఫిరోజ్ తో నిఖాకి ఒప్పుకుంటాడు. బాయ్ కాట్ నిఖా ఖర్చులకోసం మళ్లీ దారి దోపిడీ చేస్తాడు. ప్రమాదవశాత్తు దోపిడీకి గురి అయిన వారులో ఒకరు మరణిస్తాడు. ఆ నేరం కింద న్యాయస్థానం బాయ్ కాట్ కి పద్నాలుగు సంవత్సరాలు జైలు శిక్షను విధించింది.

చెంచమ్మ తన బ్రతుకును వెళ్లదీయడానికి పూర్వం తాను చేసే పనులనే మళ్లీ చేసుకుని బ్రతకసాగింది. కొన్ని ఏళ్లకు బాయ్ కాట్ కు శిక్షాకాలం తగ్గించి విడుదల చేసింది న్యాయస్థానం. బాయ్ కాట్ నేరుగా తన గుడిసె దగ్గరకు వచ్చాడు జైలు నుండి. ఇంట్లో చెంచమ్మ కనబడదు. తన దోస్తు గతంలో తనకు చెప్పిన మాటలు బాయ్ కాట్ కు గుర్తుకు వస్తాయి. బాయ్ కాట్ సారా తెచ్చుకుని తన గుడిసె ముందు అరుగుపై పడుకుని ఉంటాడు. చెంచమ్మ అర్ధరాత్రికి గుడిసెకు వస్తుంది. వాకిట్లో ఉన్న బాయ్ కాట్ ను చూసి చెంచమ్మ పలకరించింది. "బాయ్యా, ఇదిగో బిర్యానీ తెచ్చా" అంటూ బాయ్ కాట్ కు తాను తెచ్చిన అన్నాన్ని ఇస్తుంది చెంచమ్మ. బాయ్ కాట్ ఏమి మాట్లాడడు. బాయ్ కాట్ మౌనానికి చెంచమ్మ భయపడింది.

నెమ్మదిగా గుడిసెలోకెళ్ళి మళ్లీ గుడిసె బయటకు వస్తుంది చెంచమ్మ. గుడిసెలో నుండి తెచ్చిన ఎలుకల మందును చెంచమ్మ బాయ్ కాట్ కు తాను పెట్టిన బిరియానీలో అతడికి తెలియకుండా కలిపింది. తరవాత చెంచమ్మ గుడిసెలోపలకు వెళ్లి తలుపు వేసుకుని పడుకుంటుంది. ఉదయాన్నే బాయ్ కట్టన్నలే అంటూ అరుగుమీద పడుకుని ఉన్న బాయ్ కాట్ ని అతడి దోస్తు వలి పిలుస్తుంటాడు. బాయ్ కాట్ ఎంతకీ లేవకపోవడంతో "ఓ చెంచక్క అన్న పలకట్లేదు" అని చెంచమ్మను వలి తలుపు కొట్టి పిలుస్తాడు. చెంచమ్మ వచ్చి "బాయ్యా అని పిలచి నన్నొగ్గేసినవే? నా బతుకు చీకటి బుగ్గి చేస్తివే" అని బాయ్ కాట్ శవం పై పడి సోకండాలు పెడుతుంది. "నా ఆకలికి దిక్కు నువ్వని నమ్మి నీతో అడుగులేస్తి. నిన్ను పోలీసోళ్ళు ఎత్తుకెళ్తే నాది మునుపుటి చీకటి బతుకాయే. విడుదల ఐన ప్రతి సారి నువ్వు నా వొళ్ళు హూనమయ్యేటట్లు కొడితివి. ప్రతి రేయి నా బతుకులో వచ్చే వారు వెన్నెల కురిపించారు ఒక్క నువ్వు తప్ప. నీ అరాచకాలకు సమాజం ఏనాడో నిన్ను బాయికాట్ చేసింది. నీ లెక్క ఉండే పెనిమిటిని నేను బాయ్ కాట్ చేస్తా" అని చెంచమ్మ తన సోకండాల మాటునఎవరికీ కనబడని తన హృదయ ఆక్రోశాన్ని బాయికాటుకు చెబుతుంది.

-రాధికాఫణి. వంగర (పారా)
కేటీ - టెక్సస్ .యూఎస్ ఏ.
:+12696442118(వాట్సప్)

బాలలు ... బంగరు దివ్వెలు?

భవిత పూదోటలో విరిసిన
భావి తరాల కుసుమాలు
చిట్టి చినుకుల్లో తడిసి ముద్దవుతూ
లోకాన్ని మరచి ఆడి పాడే పాపలు
నిస్వార్థమైన మదిలో
చిరునవ్వుల చిరునామాలు
కల్లాకపటం తెలియని వనంలో
ఆనందంగా చిగురించే మొగ్గలు
తొలి ఉషస్సు లో జిగేల్ మనే
స్వర్ణ కిరణాల వెలుగులు
అజ్ఞానం తిమిరంలో కూడా
జ్ఞానకాంతులు వెలిగించే దివ్వెలు
కుల మతాల అడ్డుగోడలు విడిచి
మానవత్వమే ముఖ్య మనుకునే
మమకారపు బంధుత్వాలు
ఆస్తులు అంతస్తులు తేడాలు లేకుండా
సంతోషంగా సాహచర్యం చేసే నేస్తాలు
అనుభవాల ఆకాశంలో హాయిగా
విహరించే స్వేచ్ఛా విహంగాలు ..
బాలలు!

-చంచల రవి కుమార్
8500330700

సరస్వతి కోవెల

పుస్తకాల ర్యాకులు కాదు లైబ్రరీ..
మెదడులో జ్ఞానబీజాలు వేసే గుడి !
తరాలను నిర్మించే గ్రంధాలయం..
నిశీధిలోనూ దారిని చూపే
దీపస్తంభం !
పుస్తకం హస్త భూషమే కాదు..
మస్తిష్క వికాస సాధనం కూడా !
సుభావాక్షరాలు కొలువుండే..
జ్ఞాన వితరణ అక్షర బాండాగారం !
అక్షరాల కుప్ప కాదు పుస్తకం..
విద్యాబుద్ధుల్ని వెలిగించే దీపం !
ప్రాణమే లేని పుస్తకం...
కోట్ల మెదళ్ళను వెలిగించే ఇంధనం !
భవనం కాదు గ్రంధాలయమంటే...
మదిలో సరస్వతిని ప్రతిష్టించే కోవెల !
ఎంత తోడినా తరగని నిధి..
అంతేలేని జ్ఞాన జ్యోతి గ్రంధాలయం !
అక్షరాలు అర్థవంతంగా పేర్చగా..
సద్భావనల వరదలు పొంగి పొరలు !

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

మనిషి మారే దెన్నడో?

ఔను
మనిషి మనిషిలా లేడు
తన మనసును స్వార్థముతో
కుళ్ళు, కపటాలాతో, స్వలాభ పేక్షతో
నింపుకొని నిర్మలమైన మనసును
అతలా కుతలము చేసుకుంటున్నాడు
"దయ", "మానవత్వం"లను మరచి,
మంచితనాన్ని విడచి నానాటికి
మరుగుజ్జులా మారుతున్నాడు
భగవంతుడు చూపించిన మార్గానికి
విరుద్ధంగా ,
ప్రకృతి మాత ప్రసాదించిన సంపదను
కాలరాస్తూ,
పైపైకి మాత్రము
మంచితనాన్ని ముసుగేసుకుంటు,
తీపి మాటలను వల్లిస్తూ నేనే గొప్ప అని
విర్ర వీగుతున్నాడు
తేనె పూసిన కత్తిలా ప్రవర్తించుతున్నాడు
దేశానికి, సమాజానికి హాని కల్గించే
చీడ పురుగు అవుతున్నాడు
మనిషి నీలో మార్పు రావాలి
హరించికు పోతున్న
మనిషి మళ్ళీ నిద్ర లేవాలి
నీ చూపు మారాలి,
నిన్ను నువ్వే తెలుసు కొని మారాలి
లేదంటే, కాదంటే నీ కన్నా గొప్పవారు,
అహముతో విర్ర వీగి
మిడిసిపడిన వారు
ఎందరో "కాలచక్రము" లో
కాలము చేసారు
నిన్ను గమనించేవాడొకడున్నాడు
వాడు ఎవరికి దొరకనివాడు
ఎవరిని ఎలా మట్టుబెట్టాలో తెలిసిన
బహు మాయగాడు
ఈ మానవ జన్మను సత్కర్మలు చేసి
సార్థకతనొం దించుకో -
సమాజానికి మేలు చేయాలని
మనిషి మనిషిలా మారి
"మనీషి"కావాలని ఆశిస్తాను
నా ఆశ తీరేదెప్పుడో
మనిషి మారే దెన్నడో?

-విశ్వనాథ నరసింహం
9490971589

హృదయంలో వెన్నెల

బ్రతుకు భవితవ్యానికి
కొత్త భావాల
కాలం ఇచ్చేది.

అక్షరం ఇచ్చి అనుభూతి కన్నా
జీవితమిచ్చే అనుభవాల సారము
అన్వేషించే ప్రధానమైన దారిలో
ప్రగతి బాటకు సూచికగా.

చెదును వదిలివేసి
వసంత మాసపు
చల్లని గాలిలా.

వెలుగులు వెదజల్లే వెన్నెల రేయిలో
మమతల తీరపు మల్లెలు.

మంచిని సదా అందించే హృదయం
మనసు పరవశిస్తుంది
మమత మధురమవుతుంది.

నిన్న మరిచి నేడు వైపు
హృదయపూర్వక
హృదయ వీణను రవళిస్తూ

సుందర మధుర
ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ
కనులతో పరవశిస్తూ కమనీయమైన
రాగాలతో ఆస్వాదిస్తూ
కాలాన్ని మర్చిపోయి
మంచులా మనసు
తేలి తేలిపోయే గాలిలో పసందైన
నా మది దోచిన
మమతల సోయ
గాలరాగమై సాగిపోతుంది

-డాక్టర్ సిహెచ్ ఆంజనేయులు
7702537453

కన్నీటి ధార

ఆనందం అవధులు దాటినప్పుడు దుఃఖం
వైరంతో మార్గం అన్వేషిస్తుంది...

మనసు కెంతో ఇష్టమైనది దూరమైనప్పుడు
అనరాని అభూత కల్పనలు సృష్టించినపుడు.

వేదన మేఘం అవలీలగా కమ్ముకొని
మనసు పడే వెతల వీణ రాగం
పలుకుతుంది మౌనంగా.
మరణ శోకము చూసినపుడు
హృదయం ద్రవించి అశ్రుధార ప్రవహిస్తుంది
మనసు వేసే శిక్షకు
కళ్ళెందుకు అనుభవిస్తాయో
మనిషికి తెలియని విషయం!

అంతర్మధనంలో కలిగే
ఆక్రందనల వెల్లువ ఒకే విధం
తడి బారిన కళ్ళకు
అద్దంపై వర్షం నిలుస్తుంది..

కపట మాటలతో
కన్నీరు కార్చడం
పొగిలి పొగిలి ఏడ్చిన
పన్నీటి ధార కురవదేం?
కన్నీరు కార్చని కళ్ళు లేవు



-సయ్యద్ జహీర్ అహ్మద్,
9505152560

ఓటు హక్కు

అమ్ముకోవడం
కొనుక్కోవడం
సర్వ సాధారణం
అయింది
నేటి ప్రజాస్వామ్యం లో
బూతులు నీతులై
ప్రజ్వరిల్లి విస్తరించి
పరిమళిస్తున్న దేశం లో

-వి.సూర్యారావు
9246911234.

దుఃఖ నది

(కరోనా కథలు)

తెలుగు సాహిత్యంలో కథకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. తెలుగు కథలు అంతర్జాతీయఖ్యాతిని గడించాయి. నాటికి ,నేటికి ,ఎప్పటికీ పిల్లలనుంచి పెద్దల వరకు అందరూ కథలు అంటే చెవి కోసుకుంటారు. పిల్లలలో "కథలు" ఆలోచన శక్తిని, సృజనాత్మకతను, మానసిక వికాసానికి ఎంతగానో తోడ్పడతాయి. కాలం తనలో జరిగేటటువంటి మార్పులను లిఖిత బద్ధం చేసుకోవడానికి కవులను, రచయితలను సృష్టించుకుంటుంది. కవులు రచయితలు తమ జీవితంలోని కొన్ని అనుభవాలను, సన్నివేశాలను, సంఘర్షణల మధ్య సంబంధాలను అందంగా చిత్రించడంలో కథను ఒక ప్రక్రియగా ఎంచుకొని రచనలు చేస్తూ ఉంటారు.

ప్రపంచాన్ని ఒక్క సారిగా కుదిపిన కరోనా పరిస్థితులు, ఆనాడు ప్రజలు ఎదుర్కొన్న కష్టాలతాలూకు అనుభవాలు,ఇబ్బందులు మనుషుల మధ్య సంబంధాలు చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచే విధంగా కళ్లకు కట్టినట్లుగా కరోనా కథలు అన్నింటిని దుఃఖ నది అనే శీర్షికతో "డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ" గారు ఒక కథల సంపుటిని వెలువరించారు. ఈ పుస్తకంలో మొత్తం 12 కథలు విభిన్న వస్తువులతో, కరోనా నేపథ్యంగా ప్రతి కథ వాస్తవికతను కళ్లముందు ఆవిష్కరించారు.. రచయిత్రి కథను రాయడంలో వాడిన భాష చాలా సరళంగా, సులభంగా, తేలికగా అర్థమయ్యే విధంగా ఉండడం ముదావహం.. కొన్ని కథలలో అంబేద్కర్ భావజాలాన్ని, తన అస్తిత్వ నేపథ్యం ను స్పృశిస్తూ రాయడం జరిగింది..

పుస్తకం తెరవగానే మొదటగా కనిపించే కథ..

"ఆలయం"

ఈ కథలో ఒకే సామాజిక నేపథ్యం నుంచి వచ్చిన రామస్వామి, శివన్న ఇద్దరూ బాల్య స్నేహితులు. అధికారం, ఆర్థిక బలం మనిషిని ఏ విధంగా మారుస్తుంది? అనే విషయాన్ని శివన్న పాత్ర ద్వారా అర్థమవుతుంది. శివన్న ఆ గ్రామానికి ఎమ్మెల్యేగా ఉంటాడు, రామస్వామి వాళ్ళ గ్రామానికి పాఠశాల హెచ్ఎం గా వస్తాడు. పాఠశాల శిథిలావస్థలో ఉందని కప్పు పై పెచ్చులు ఊడి కింద పడుతున్నాయని దాంతో పిల్లలు బడికి రావడానికి భయపడుతున్నారని చెబుతాడు. శివన్న సాయం చేయకపోగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తాడు. అదే సమయానికి డాక్టర్ సాగర్ కూడా అక్కడికి వచ్చి ఎమ్మెల్యే గారికి హాస్పిటల్లో ఉన్నటువంటి సమస్యలను నివేదిస్తాడు దానికి కూడా ఎమ్మెల్యే నిర్లక్ష్య ధోరణితో సమాధానం చెబుతాడు. కొంత కాలం తర్వాత ఎమ్మెల్యేకు కరోనా సోకుతుంది. గ్రామంలో ఉన్న బడికి, వైద్యానికి సహాయం చేయని ఎమ్మెల్యే, ఆలయానికి ,ఆలయ పూజారికి లక్షల రూపాయలు వెచ్చించడం, తదుపరి ఎమ్మెల్యే లో వచ్చిన మార్పు,ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడడం ఆ తర్వాత ఏం జరిగిందనే విషయాన్ని ఈ కథలో వివరించారు రచయిత్రి..

అన్నదానం.

ఈ కథలో సువర్ణ, రమేష్ దంపతులు బాగా సంపాదించి ఆనందంగా జీవిస్తుంటారు. కరోనా విజృంభిస్తున్న సమయంలో ఇద్దరు కరోనాకు గురి కావడం జరుగుతుంది అప్పుడు వారికి ఆరు నెలల పసిపాప ఉంటుంది. ఆ పాపని చూసుకోవడానికి ఎవరూ లేక ఏడుస్తున్న క్రమంలో ఆ ఇంటి పనిమనిషి ఏమి చేసింది? ఇంటి చుట్టుపక్కల ఉన్న సొంత బంధువులే ఎలా ప్రవర్తించారు? ఆపద వచ్చినప్పుడు నా అని అనుకున్న వాళ్ళే ఎంత దూరంగా ఉంటారో? కరోనా సమయంలో మానవత్వాన్ని చాటుకున్న పనిమనిషి రూపంలో ఈ కథ కొనసాగుతోంది..

దుఃఖ నది

"కరోనా విజృంభిస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం ఉన్నఫలంగా లాక్ డౌన్ విధించడంతో బ్రతుకు తెరువు కోసం బొంబాయి కి వలస వెళ్లిన కుటుంబం శాంతమ్మ నాగన్న. వీరు ఇద్దరు అక్కడ మేస్త్రి పని చేస్తూ పొట్ట పోసుకుంటూరు, కానీ శాంతమ్మకు ఇంటి వద్ద విడిచి వచ్చిన పిల్లలు గుర్తొస్తూ కన్నీళ్లు కారుస్తుంది ఎలాగైనా తమ పిల్లలను చూడాలని నాగన్న తో బలవంత పెడుతుంది, అప్పుడు దేశమంతా లాక్ డౌన్ ఉండడంవల్ల ఎలాంటి వాహన రాకపోకలు లేకపోవడంతో కాలినడకనే వాళ్ళ సొంత ఊరు చేరుకునే క్రమంలో మార్గమధ్యంలో నాగన్న మరణించడం, ఇంటికి చేరిన శాంతమ్మ తన పుస్తెలతాడును తాకట్టు పెట్టి తెచ్చిన డబ్బులతో పిల్లలకు ఆకలి తీరుస్తుంది.. ఆ ఒక పూట కడుపునిండా భోజనం పెట్టాక , తనుకాలం చేయడము.. ఇత్యాది అనేక దుఃఖపూరితమైనటువంటి విషయాల నేపథ్యంతో ఈ కథ కొనసాగుతుంది , కథలో దుఃఖపు ఛాయలు మనసును ఊపిరాడనివ్వవు..

> కవులు రచయితలు తమ జీవితంలోని కొన్ని అనుభవా లను, సన్నివేశాలను, సంఘర్షణల మధ్య సంబంధాలను అందంగా చిత్రించడంలో కథను ఒక ప్రక్రియగా ఎంచుకొని రచనలు చేస్తూ ఉంటారు.

విగ్రహం

ఈ కథలో రోజురోజుకు కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో తమ సొంత ఇంటికి వెళ్లాలని తపించిపోయే వలసవాదులను సినీ హీరో సోను సూద్ తన సొంత ఖర్చులతో ఆస్తులను తలకా పెట్టి అనేక బస్సులు వేసి వారందరిని వారి వారి స్థావరాలుకు చేర్చాడు.. ఈ యదార్థ విషయాన్ని విగ్రహం కథ ద్వార

జీవితానికి.. కథకు పెద్దగా తేడా ఉండదు

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుజాతారెడ్డి. చిత్రంలో పెనుగొండ లక్ష్మీనారాయణ, కె. శివారెడ్డి, నవీన్, కె. సునీతారాణి, అంజయ్య చౌదరి, పాపినేని శివశంకర్.

జీవితానికి కథకు పెద్దగా తేడా ఉండదు. కథకు పెద్దగా తేడా ఉండదు. సమాజాన్ని, జాతి సంస్కృతిని జీవన విధానాన్ని, మన మూలాల్ని తెలియజేసేది. ముందు తరాలకు అందించేదే సాహిత్యం" అని 'కథ 2021' ఆవిష్కరణ సభలో వక్తలు ఉద్ఘాటించారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ఆర్థిక సహకారంతో కథాసాహితీ 1990 నుంచి ఉత్తమ కథలను పాఠకులకు అందిస్తోంది. ఆ సంకలనాల పరంపరలో భాగంగా 32వ 'కథ-2021' ఆవిష్కరణ సభ శనివారం హైదరాబాద్‌లో జరిగింది.

బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు.

రచయిత్రి డా. ముదిగంటి సుజాతారెడ్డి కథ 2021ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథి తానా అధ్యక్షులు లావు అంజయ్య చౌదరి మాట్లాడుతూ దాదాపు రెండు దశాబ్దాలకు పైగా వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ చేస్తున్న సాహిత్య సేవలో తానాకు అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

కవి కె. శివారెడ్డి మాట్లాడుతూ కరోనా కారణంగా మూడేళ్ల క్రితం వచ్చిన శూన్యం మామూలుది కాదని, అదంతా ఈ కథలో ప్రతిబింబిస్తోందని అన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యురాలు కె. సునీతారాణి పుస్తకాన్ని సమీక్షించారు. తానా 23వ మహాసభల కన్వీనర్ రవి పొట్లూరి ఆత్మీయ ప్రసంగం చేశారు. కథాసాహితీ సంపాదకులు వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం 'కథ 2021' సంకలనంలోని రచయితలు తమ కథ నేపథ్యాన్ని వివరించారు.

డా॥ పసునూరి రవీందర్ రచించిన "పోటెత్తిన పాట" ఆవిష్కరణ

పుస్తకావిష్కరణలో అతిథులు.

కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ రచించిన "పోటెత్తిన పాట' పుస్తకావిష్కరణ శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. భీమ్‌ద్రమ్ వ్యవస్థాపకుడు నలిగంటి శరత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ప్రజాయుద్ధనౌక గద్దర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, ప్రముఖ కవి ఆచార్య పిల్లలమర్రి రాములు ప్రజాగాయని విమలక్క, ప్రముఖ రచయితలు డాక్టర్ కోయి కోటేశ్వరరావు, డాక్టర్ పొన్నాల బాలయ్య ప్రజా వాగ్గేయకారులు ఏపూరి సోమన్న, చింతల యాదగిరి, యోచనమాట్ల తిరుపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలంగాణలో పాల్కూరి సోమనాథుడి నుంచి పసునూరి రవీందర్ దాకా అనేకమంది పాటకు ప్రాణం పోశారని వివరించారు. తెలంగాణ అంటేనే ఉద్యమ పాట అన్నారు. తన సమకాలీన పాటల రచయితల సాహిత్య సాంస్కృతిక కార్యచరణకు సంబంధించిన చరిత్రను గ్రంథస్తం చేసి 'పోటెత్తిన పాట' పేరుతో రచనకు పూనుకున్నారని వారన్నారు. సాహిత్య ఉద్యమాల్లో పనిచేస్తూ రచయితలుగా విమర్శకులుగా చెలామణిలో ఉన్న వారికి రవీందర్‌కు చాలా తేడా ఉందన్నారు. డాక్టర్ పసునూరి రవీందర్ తన తల్లికి పుస్తకాన్ని అంకితమిచ్చారు.

మనసు

కోరికల
అలలు
ఆగవు..

ఆశలకు
ఆవలితీరం
కనిపించదు..

"మనసు
ఓ మహాసముద్రం"

-పేరిశెట్టిబాబు
9247170800

అప్పు చేసి పప్పుకూడు

అప్పులతో అందాల మేడలు కట్టి
అద్భుతాలు సృష్టించాలని అనుకోవడం

మనందరినీ పిచ్చివాళ్లను చేయడం
అప్పు కుప్ప లేక మారుతూనే ఉంది

ప్రజల నెత్తిపైన అప్పులతో కొప్పు వేయడం
చివరకు పన్నులపై పన్నులు వేసి
ప్రజల్ని కష్టాలపాలు చేయడం.

అప్పు ముప్పు అనేది ఎవరు చెప్పాలి
అప్పు అనేది ప్రపంచంలో
ఏ దేశానికైనా అనర్థదాయకం.

బ్రతుకులన్నీ ఆగమాగం
అప్పుల అంగడిలో సామాన్యుని బ్రతుకు
అయోమయం జగన్నాథం.

అప్పులు లేకుండా బ్రతికే వాడే
నిజమైన ధనవంతుడు ఎక్కడైనా
ఏ దేశంలోనైనా ఏ ప్రాంతంలోనైనా

అప్పు లేని మనిషి
నిజమైన స్వతంత్ర జీవి ధైర్యశాలి....

అప్పులతో ఎవరిని ఉద్ధరించిన
వాడి నెత్తి పైన ఎప్పుడో ఒకసారి పడుతుంది

-డాక్టర్ సిహెచ్ ఆంజనేయులు
7702537453

మందు - మగువ

అవకురా
మందుకు
బానిస
కరిగిపోతావు
కాలచక్రంలో పావులా
చూడకురా
పరస్త్రీని కాంక్షతో

నిప్పులా నిలువల్లా
నాశనమవుతావు
నామరూపాలు లేకుండా!

-యలమర్తి అనూరాధ
9247260206

సమస్యల్లో గ్రంథాలయాలు

గ్రంథాలయాల పునర్జీవంతో మేధో వికాసం

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు. మానవుని మేధో సంపత్తిని పెంచుతాయి. సమకాలీన సమాజంలో సంభవిస్తున్న మార్పులపట్ల అవగాహన చైతన్య ముకలిగించటలో గ్రంథాలయాలు బహుముఖపాత్రపోషిస్థాయి. ప్రపంచములో జరిగిన పలు సామాజిక 'సాంస్కృతిక' స్వాతంత్ర ఉద్యమాలలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషించాయి. నాటి స్వతంత్ర ఉద్యమం నుండి నేటి తెలంగాణ ఉద్యమం వరకు ప్రజలకు కావలసిన సమాచారాన్ని జ్ఞానాన్ని పరిజ్ఞానాన్ని అందిస్తూ చైతన్య పరిచిన గ్రంథాలయాలు నేడు ప్రభుత్వం పాలకుల ఆదరణలేక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి .

గ్రంథాలయాలు జ్ఞానాన్ని విజ్ఞానాన్ని ఉచితంగా ప్రజానీకానికి అందించి భావి తరాలకు ప్రభావితం చేసే ఎన్నో రకాల పుస్తకాలు ప్రాచీన సంస్కృతి 'సాంప్రదాయాలను ప్రతిబింబించే ప్రాచీన' ఆధునా తన గ్రంథాలు సాహిత్యం చరిత్రకు సంబంధించిన అమూల్యమైన పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉంచుతూ విద్యార్థులను నిరు ద్యోగ యువతను మంచివైపు నడపించే దేవాలయాలు గ్రంథాలయాలు.

రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లా కేంద్రాలలో డివిజన్ 'మండల 'నగర పట్టణ 'మున్సిపల్ 'మేజర్ గ్రామ పంచాయితీలలో గ్రంథాలయాలను ప్రభుత్వం నెలకొల్పింది. గ్రామీణ ప్రాంత గ్రంథాలయాలలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి.

తెలంగాణ ఏర్పడి 7 సంవత్సరాల తర్వాత భారీస్థాయిలో ఉద్యోగాల నియామక ప్రక్రియ మొదలైంది . నిరుద్యోగులు గ్రంథాలయాలకు వెల్లుచున్నారు. గ్రంథాలయాలు పాఠకులతో కిటకిట లాడుతున్నాయి. నిరుద్యోగులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తునఉద్యోగ నియామకాల ప్రక్రియను ప్రారంభించడంతో ఉద్యోగార్థులు అంతా పోటీపరీక్షలకు సన్నద్ధమౌతున్నారు కొచింగ్ కేంద్రాలకు గ్రంథాలయాలకు పరుగులు తీస్తున్నారు. నిరుద్యోగులు అధిక సంఖ్యలో గ్రంథాలయాలు సేవలు ఉపయోగించుకోవడానికిఆసక్తి చూపుతున్నారు ప్రభుత్వం నిరుద్యోగుల పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావటానికి కావాల్సిన పుస్తకాలు వార్త పత్రికలు జర్నల్స్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాల సమాచారం అందుబాటులో ఉంచడానికి ప్రత్యేకంగా కోచింగ్ సెంటర్ గ్రంథాలయాలు అందుబాటులో ఉంచాలని గ్రంథాలయ శాఖను ఆదేశించింది. కానీ క్షేత్ర స్థాయిలో పలు గ్రంథాలయాలు సమస్యల వలయములో కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రంథాలయాలలో కనీస వసతులు లేవు ఇప్పటికీ 50 ఏళ్ళ నుండి కిరాయి భవనాలలోగ్రంథాలయాలు నిర్వహించబడుతున్నాయి.ఆధునాతన భవనాలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేక పోవడం శోచనీయం .సిబ్బంది కొరత రాజ్య మేలుతుంది. అనేక గ్రంథాలయాలలో పనిచేసే సిబ్బంది రిటైర్డ్ కావడం వల్ల ఏర్పడిన ఖాళీలలో కొత్త నియామకాలు చేపట్టలేదు. ఒకే లైబ్రేరియన్ పలు శాఖ గ్రంథాలయాలకు" ఇంచర్జ్ గా" కొనసాగుతున్నారు.కొత్త నియామకాల ఊసేలేదు.

పాఠకులకు గ్రంథాలయ సేవలు ఆశించిన మేరకు లభ్యం కాని దుస్థితి నెలకొన్నది.

పత్రికలు సకాలములో రాకపోవడం పాఠకుల సంఖ్య సరిపోయే స్థాయిలో పత్రికలు అందుబాటులో లేవు.పాఠకులుకూర్చోవడానికి కుర్చీలు బల్లలు బెంచీలు లేకపోవడం. గ్రంథాలయ అధికారులు అందుబాటులో వుండక పోవడం పలు గ్రంథాలయాలు ఇంఛార్జి ద్వారా నిర్వహించబడడంవల్ల గ్రంథాలయాలను పూర్తి స్థాయిలో ఉపయోగించుకునే స్థితి లేదు. మౌలిక సౌకర్యాలు,' కరెంటు వెలుతురు 'మూత్రశాలలు toilets లేవు ఇరకు గదుల్లో పాఠకులు పత్రికలుచదువుకునేదుస్థితి నెలకొంది. పోటీపరీక్షలకు సంబంధించిన పుస్తకాలు జిల్లా గ్రేడ్ 1 & 2 గ్రంథాలయాలు మాత్రమే సరఫరా చేయడం వల్ల మండల నగర గ్రామీణ ప్రాంతాలలో పాఠకులకు అందుబాటులో లేక పోవడం వల్ల గ్రామీణ యువత నిరుద్యోగులు గ్రంథాలయాలువైపు రాక పోవడచేత విజ్ఞానాన్ని పెంచుకోలేకపోతున్నారు. గ్రామ పంచాయితీలు మున్సిపాలిటీలు ప్రజల నుండి ప్రాపర్టీ టాక్స్ వసూళు చేసేటపుడు లైబ్రరీ సెస్ వసూలు సకాలములో జరుగక పోవడం వల్ల బకాయిలు యేళ్ల తరబడి రాకపోవడంతో గ్రంథాలయాలు మనుగడ నానాటికీ దుర్భరంగా మారుతుంది. జిల్లా ఉన్నత అధికారులు గ్రంథాలయాల అభివృద్ధిమీదదృష్టిపెట్టాలి. ప్రభుత్వం గ్రంథాలయాలకు బడ్జెట్ కేటాయింపుల్లో వివక్ష మానుకోవాలి.

గ్రంథాలయాలకు ప్రతేక మంత్రిత్వ శాఖ వుండాలి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాలు అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలి .పోటీపరీక్షల సందర్భంగా గ్రంథాలయాల పని వేళలుమార్చాలి. నీటి వసతి విశ్రాంతి సౌకర్యం,' బోజన వసతి విషయ నిపుణుల ద్వారా సందేహాల నివృత్తి కరెంట్ అఫ్ఫైర్స్ మీద చర్చలు క్విజ్ ప్రతిభ పాటవ పోటీలు నిరంతంగా నిర్వహించే కార్యాచరణ ప్రణాళికను అమలు చెయ్యాలి. మహిళలకు బాలలకు ప్రతేక గ్రంథాలయాలు నెలకొలుపాలి .పాటశాల కళాశాల స్థాయిలో గ్రంథాలయం ను విద్యా కరికులములో భాగం చెయ్యాలి లైబ్రరీ పీరియడ్ టైం టేబులో తప్పనిసరి అంశంగా చేర్చాలి.

గ్రంథాలయాల అభివృద్ధి విస్తరన నిర్వహణలో పౌం సమాజం భాగస్వామ్యాన్ని పెంచాలి.

డిజిటల్ గ్రంథాలయాలు ఏర్పాటుకు ప్రభుత్వంకృషి చెయ్యాలి .ఇంటర్నెట్ సేవలు ఉచితంగాగ్రామీణప్రాంతాలకు అందించాలి. గ్రంథాలయాలకు అవసరమైన కంప్యూటర్లు అందించాలి. సెస్ బకాయిలు వసూలు చేసి జిల్లా గ్రంథాలయాల పునర్జీవంతో మేధో వికాసానికి బహుముఖ వ్యూహంతో చర్యలు చేపట్టి గ్రంథాలయాలను మనోవిజ్ఞానకేంద్రాలుగా తీర్చిదిద్దాలి. గ్రంథాలయ ఉద్యమం ద్వారా మెరుగైన సమాజాన్ని నిర్మించి విజ్ఞానం 'వివేకం 'విశ్లేషణా సామర్థ్యాలను' పెంపొందించి మానవ వనరుల సర్వతో ముఖ వికాసానికి ప్రభుత్వాలుకృషి చెయ్యాలి.

-నేదునూరి కనకయ్య
9440245771

బ్రతుకులు

మారుతున్నాయి
మారుతున్నాయి
వీధికో పేరు
ఊరికో పేరు
జిల్లాకో పేరు
పథకానికో ఒక పేరు
ఉచితానికో ఒక పేరు
ఉన్నదానికొక పేరు
లేనిదానికొక పేరు
మారుతున్నాయి
మారుతున్నాయి కానీ

యేళ్లు గడుస్తున్నా
అదే మనుషులు
అదే మాటలు
ఏ మార్పు లేని జీవితాలు
యామరుతున్న జీవితాలు
అవే వెదలు
అవే వేదనలు
అవే "బ్రతుకులు"

-లక్ష్మీ శ్రీనివాస్
9676601192

గానసభలో కుందుర్తి శతజయంతి

సుధామకు పురస్కారాన్ని బహూకరిస్తున్న డా॥ కేతవరపు రాజ్యశ్రీ, డా॥ మధుసూదనరావు, భారతీ కమలాకర్, డా॥ ముక్తేవి భారతి, విహారి తదితరులు.

త్యాగరాయ గానసభలో శుక్రవారం రాత్రి వచన కవిత్వ ఉద్యమకారుడు కుందుర్తి ఆంజనేయులు శతజయంతిని నిర్వహించారు. కమలాకర లలిత కళాభారతి నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుధామకు కుందుర్తి కవిత్వ ప్రతిభ పురస్కారాన్ని, దూరదర్శన్ విశ్రాంత సంచాలకులు డాక్టర్ మధుసూదనరావు అందజేశారు. కుందుర్తి వచన కవిత యుగకర్త అన్నారు. సుధామ బిన్న సాహితీ ప్రక్రియల్లో ప్రావీణ్యులన్నారు. సాహితీవేత్త ఆచార్య టీ. గౌరీశంకర్, అధ్యక్షత వహించిన సభలో కథకుడు విహారి, రచయిత్రి డాక్టర్ ముక్తేవి భారతి తదితరులు పాల్గొన్నారు. అతిథులకు నిర్వాహకురాలు భారతీ కమలాకర్ స్వాగతం పలికారు. అంతకుముందు ముక్తేవి భారతి అధ్యక్షతన కవి సమ్మేళనాన్ని నిర్వహించారు.

పుస్తక సమీక్ష

'దేవునితో మహా ప్రయాణం' కె.జె. రమేష్ దైవ సృజనం



దైవజనులైన మోషేచే లిఖించబడిన పంచకాండములను మధురమైన నూతన కవితా ప్రక్రియలో, కవి కె.జె. రమేష్ 'దేవునితో మహా ప్రయాణం' రచించారు. బైబిలు పాత నిబంధనలో ఆది, నిర్గమ, లేవియ, సంఖ్యా, ద్వితీయోపదేశ అయిదు కాండాలను క్రైస్తవ విశ్వాసులకు పరమ పూజనీయంగా కవితా రూపకంగా విశదీకరించారు. మోషే పంచకాన్ని 'తోరా' అంటారు. ఈ పవిత్ర గ్రంథాన్ని ఆ క్రమంలో రచించి కె.జె.రమేష్ కవిగా, దైవ విశ్వాసిగా అభినందనలు అందుకొన్నారు. భక్త్యంజలితో ప్రారంభమైన ఈ గ్రంథంలో బైబిలు అంతరార్థాలను, క్రీస్తు భక్తునిగా కె.జె. రమేష్ తాను సృష్టించిన నూతన కవితా ప్రక్రియ ద్వారా, చదివి ఆచరించిన వారి జీవితాలు ప్రశాంతంగా, మధురంగా వుండాలని ఆకాంక్షించారు. పరిశుద్ధాత్మ దేవుడే నా ఆలోచనలను అక్షరీకరించారని వినమ్ర హృదయంతో వివరించి, విశ్వాసంతో, దేవున్ని ప్రేమించి ప్రార్థించాలని, జీవిత ప్రయాణంలో ప్రభువుతో కలిసి ఎల్ల జనులు పయనించాలని, దైవ కృపతో సదా జీవించాలని అభిలషించారు. ఈ పవిత్ర గ్రంథంలో కవి రమేష్, కవితా ప్రతిభ, ఇతివృత్తంతో ఆరు వందల కవితలతో వినూత్నంగా చదువరుల హృదయాలను ఆకట్టుకుంటోంది.

"హృదయం
కాఠిన్యాన్ని మోస్తే
ఫలాలు
కష్టాల్ని కంటాయి".

"విత్తనాలు తమ
ఏరికకు దర్పణాలు
ఫలాలు జనాలకు
త్యాగపూరిత తేజాలు"

వంటి మంచి కవితా సందేశం అందించారు కవి. ఈ మహా ప్రయాణం, శాంతి సహనం ఓర్పుతో చల్లని ప్రేమను కాంతిని ప్రసరింపచేసింది. మేఘపు స్తంభపు వెలుగులో దేవున్ని మార్గాన్ని చూపింది. పంచ కాండములలోని వ్యక్తులు, స్థలాలు, రచయిత సుపరిచయం చేయడం ఒక విశేషం.

మనిషికి ఆహారం
ప్రాణం
ప్రాణానికి ప్రార్థనే జీవాహారం
జీవనాడులకు ప్రాణ మొసగిన"

దేవునితో మహా ప్రయాణం ఒక వినూత్న అన్వేషణగా కవి కె.జె. రమేష్ అభినందనీయులు.

ప్రతులకు: కె.జె. రమేష్
2-102, నిర్మలానగర్ పోస్ట్
వినుకొండ-522 647. గుంటూరు జిల్లా
సెల్: 9440 111105



-జయసూర్య
సెల్:9014948336
9394775088

మట్టి చిప్ప

(కథ)

"పోసాని అత్తమ్మా! ఓ అత్తమ్మా! యాదున్నవే కనపడ్డ లేవూ.." అని బిగ్గరా పిలుస్తూ వచ్చింది. పక్కవీధిలో వుండే బంధువుల అమ్మాయి గంగమణి.

ఇంటి లోపలికి వచ్చిన తర్వాత కూడా "అత్తా అత్తా" అని మళ్లీ పిలువసాగింది. ఉలుకూపలుకూ లేదు.అటు ఇటు గాబరాగా వెతుకుతోంది.

ఇది గమనించిన పోసానమ్మ కోడలు సురేఖ "ఏందే గంగు గట్ల అరుస్తున్నవు. గదేదో చెవులు కోసిన మేక లెక్క ఏం కొంప లంటుక వోయినయే..'అని

"ఏం లేదక్కా! అరం దినాలాయే అత్తను సూడక, గందుకని..."

"ఓ గాదానికే గింత ఉరుకు లాటనా.. మా గుడిసె కొట్టంల పాడైంది పో.." అని గద్దించి పెట్టింది సురేఖ.

"గా కొట్టంల ఎందు.." గంగవ్వ మాట పూర్తికాక ముందే.

"ఏమో! గదేదో కుక్కకు నెయ్యి ఇసుకదన్నట్టు, గామెకు మాతాన ఉండబుద్ధిగాక గా గుడిసెల వోయి ఉంటున్నది. మా ఇజ్జత్ తియ్యనికి..."

"అయ్యో గింత సక్కని బంగ్లా ఇడుస వెట్టుకొని..."

"గట్ల సెప్పుపో గామే నోట్లే కొంచెం గడ్డి వెట్టుపో..." అంది లేని అక్కసునంతా కక్కేస్తు సురేఖ.

సురేఖ చెప్పినట్టే ఆ ముసలమ్మ ఉన్న పూరింటికి వెళ్ళింది గంగమణి.

అది పశువుల కొట్టం, దూరం నుండే పశువుల మల మూత్రాల వాసన వస్తోంది. అయినా ముక్కు మూసుకొని కొట్టం దగ్గరికి వెళ్లి చూస్తే తలుపులు తెరిచే ఉన్నాయి. లోపలికి అడుగు పెడుతూనే "అత్తమ్మా! అత్తమ్మా!" అని పిలిచింది గంగమణి.

రెండో పిలుపుకు ఎక్కడో బావిల పడ్డదాని గొంతులా ఆమె మూలుగు వినబడుతున్నది తనకు. "ఏంది బిడ్డా.." అని

ఆ మాట వినబడ్డ వైపు చూస్తే వెలుతురు సరిగా లేదు. కుక్కి మంచంల పడుకొని ఉంది. తన చుట్టూ ఈగలు ఆత్మ బంధువుల్లా మూగి ఉన్నాయి. ఆ పరిస్థితి చూసి నివ్వెరపోతూ "అత్తమ్మా! ఇదేంది.."

తనను లేపి కూచో వెడుతుంటే "బిడ్డా! గంగవ్వా! ఇన్ని దినాలు ఎటువోతివే..." అని అడిగింది దీనంగా.

"మా తమ్ముని కొడుకు లగ్గమని చెప్పలేదా?..."

"అవు బిడ్డ యాదికి లేదు. లగ్గం మంచిగైందా.."

"మంచిగనే అయింది గనీ.. గిదేందీ నువ్వు గీడ. ఆ నెత్తి సూడు ఒక దువ్వుకున్నది. లేదూ ఏం లేదు, ఆ చీర కూడా, మొఖమంతా పీక్కువోయింది. ఇదంతా ఏందత్తా.." అడిగింది. ఆమె పరిస్థితి ధీనంగా ఉన్నది చూసి.

"ఏం జేయాలే నా నశీబు గిట్లున్నది. ఎన్నో దేవుళ్ళకు మొక్కుతే పుట్టిండు. కొడుకని సంబర వడ్తిమి. గార్వం చేసి పెంచి పెద్ద జేస్తిమి. పొద్దు మావుల కాయ కష్టం చేసీ డాబా ఇల్లు కడ్తిమి. ఆనికి సదువుకూడ సదిపించి, సర్కారీ నౌకరీ కోసం కనబడ్డ అయ్య కాళ్ళు పట్టుకొని నౌకిరీ ఇప్పిస్తిమి, లగ్గం కూడా చేస్తిమి. ఆనికీ ఎండ్ల తక్క జేస్తిమి బిడ్డా..." అని అంటుంటే

"ఎవరికి జేపినవ్ నీ కొడుక్కే కదా" అంది గంగమణి.

"ఆవు బిడ్డా! గానికే గని ఈ యాల్ల.." అని చెప్తూ వెక్కివెక్కి ఏడుస్తూనే "గంగవ్వా! మీ మామ నసీబ్ మంతుడు ఈ తిప్పల్లు ఏం సూడకుండ ఎల్లెం" ఎల్లిపోయిండు. ఆ దేవుడి గుళ్లే మన్నువొయ్యా నన్నూ అప్పుడే తీసికెల్తే బాగుండె. నన్నుంచి గీ బిచ్చం బతుకు బతకమనే..." అని ముక్కు చీదుతోంది ముసలమ్మ.

"ఇప్పుడే మైందత్తా! నీముద్దుల మనవడు శీనయ్య ఉన్నడు గదా వాడ్కి.."

"ఆ గాన్ని సూసుకొనే బతుకుతున్న. నా మనువడు "అవ్వా! తిన్నవా? పన్నవా?" అని అడుగుతడు నా కన్నడు.."

ఆమె మాటల్లో కలిగించుకుంటు "గిదంతా బాగేగని, నువ్వు గిక్కడ.." అని అడుగుతుంటే

"నేను ఆ ఇంట్ల ఉండుడు పనికి రాదట. నేను ముసలైపోయిన గదా! నా బీమార్లు ఆళ్లకు అంటుతై అని యేదాది సందీ ఒకటే ఒర్రుడే..."

"మరి నాతోని ఎప్పుడూ సెప్పక వోతివి?.." ఆ మాట పుర్తవకముందే

"ఏం చెప్పుకుంట గంగవ్వా! కడుపు సీరుకుంటే కాళ్ల మీద పడ్డదన్నట్టు, బన ఇజ్జత్ తీసుకొనుడెందుకని నీతోని సెప్పలే. అయినా ఆడ సందే దొరుకేది కావ. నువ్వున్నంత సేపు తియ్యగ తేనెలు కారినట్టే మాట్లాడుతుండే. నువ్వు వోయినంక దాని నోటికొచ్చిన బూతు మాటలు తిడుతుండే. మన ఇంటి ఇషయాలు బయటోళ్లకు చెప్పితివా నిన్ను బాయిల పడేస్తా అని బెదిరించేడిది..."

"అవ్వ.. గంత ఖతర్నాక్.." ఆశ్చర్యంగా అడిగింది గంగమణి.

"అబ్బో దాని మొఖమే మొగిలి పువ్వు గుణమంతా గజ్జి కుక్కసుంటుండే.."

"మరి గీ ముచ్చట్లు బావకు తెలువవా?..." అని అడిగింది అనుమానంగా.

'ఓసినీ బావ సళ్లగుండ, పెళ్ళం ఒచ్చిన కాద్నుంచి దాని కొంగు పట్టుకొనే తిరుగుడు. అదిప్పుడు బెళ్లమై పోయింది. దానసుంటి సుందరాంగి దునియాల్నే లేదట. అది గీసిన గీత దాటుడు. లెవ్వుమంటే లేస్తడు కూసుండుమంటే కూసుంటడు.."

"మరి అత్తా తిండి.." అంది అనుమానంగా.

"ఆ ఇంత ఏసి వోతది. కుక్క కేసినట్ల అగో గా మంటిసిప్పల. అదీ సచ్చేంత మాటలనుకుంట..."

"మరి రాతీర్ల నువ్వొక్క..."

"ఇంకేవలున్నరు బిడ్డా! దయ్యం లెక్కపడి చస్తా..." ఇంకేదో చెప్పబోతోంటే..

"అత్తా నేను రేపొస్తా పిలగాండ్ల బడికెళ్ళివొచ్చే యాల్లైంది" అనిచెప్పి వెళ్లిపోయింది గంగమణి.

ఆ రోజు ఆదివారం పోసానమ్మ కొడుకు రాజేశ్వర్ ఇంటి పట్టునే ఉన్నడు. మనవడు కూడా ఆ పశువుల పాక దగ్గరే తోటి పిల్లలతో ఆడుకుంటున్న వాడల్లా నాన్నమ్మ దగ్గరికొచ్చి ఆమె చెవిలో ఏదో చెప్పి వెళ్ళిపోయాడు. బహుశా అప్పుడు ఉదయం పదకొండు దాటి ఉంటుంది. కోడలు సురేఖ ఏదేదో గొణుకుంటూ వచ్చి ముసలమ్మ తినే చిప్ప అంటకుండా అందులో పైనుంచి అన్నం వేసి వెను తిరిగింది. అలా పెట్టి తిరిగీ తిరగక ముందే "నీ సావుగాని ఎట్టికి ఏస్తున్నవేందే, ఈ కూడు నీ అయ్యవ్వ దవునే..." అని గట్టిగా కేకలేస్తూ ఆ చిప్పను కాస్త భూమికేసి కొట్టింది ముసలమ్మ అలా ఆ చిప్పను నేలకేసి కొట్టి కొట్టగానే ఆ చిప్ప కాస్త పదారు పచ్చెలైంది (ముక్కలు).

ఆ చప్పుడుకు చుట్టు పక్కల వారితోబాటు ఆడుకుంటున్న తన మనవడూ పరిగెత్తుకొని వచ్చాడు. అందరూ తలో మాదిరి గొణుకుంటున్నారు.

ప్రతి రోజూ నానమ్మకు తన అమ్మ తిట్టే తిట్లు, ఈసడించుకోవడం గమనించిన ఐదేండ్ల శీనయ్య "అవ్వా! నీకేమన్నా బుద్ధి ఉండానే, అంత సక్కని మట్టి చిప్పని ఎత్తేసి, పల్గొడ్తివి. రేపు నువ్వు సచ్చిపోయినంక మా అమ్మకు పనికొస్తుందే కదా! నేనూ ఇదే సిప్పల మా అమ్మకు వెడ్తామనుకున్న నేనేడికేంచి తేవాలే చిప్ప" అని అనుకుంటూ ఆ పిల్లోడు ఏడుస్తున్నడు.

వాడి మాటలకు అక్కడున్న వారంతా ఆశ్చర్యపోయి చూస్తుండిపోయారు. ఆ దృశ్యం చూసిన కొడుకు రాజేశ్వర్ ముఖం నేలకేసి నిలబడిపోయాడు.

"అవును మళ్ల, ఆదేదో ఆవు సేండ్ల మేస్తే దూడగట్టుమీద మేస్తదా" అన్నట్లు మనం పెద్దవాళ్ళం. ఏ తోవల నడుస్తే మనపిల్లలు ఆదే తోవలో నడుస్తారని ఊరికే అనలేదు పెద్దలు" అని అక్కడ ప్రాసెస్ వారందరిలో ఓ పెద్దాయన అంటున్నాడు.

అలాగే "మనకోసం ఎన్నోచేసి, తమ రక్త మాంసాలను ధారపోసిన పెద్దవారిన ఆదరించాలి. నేటి యువత రేపు తప్పకా వృద్ధులు అవుతారనేది మరువరాదు. రేపు మనగతీ ఇంతే కదా! అని అక్కడ గూమిగూడిన వారంతా అంటున్నారు కూడ.

నీతి: నీవే తోవల నడిస్తే నీ వారసులూ అదే తోవలో నడుస్తారని తెలుసుకుమసలాలి మరి.

-దారం గంగాధర్
సెల్:9848384777

తెలంగాణ కవిశ్రేష్ఠుడు భీమకవి



వేములవాడ భీమకవి తెలంగాణ కవిశ్రేష్ఠునిగా ఖ్యాతి గడించారని తెలంగాణ ఫిలిం ఛాంబర్ చైర్మన్ డా. ప్రతాని రామకృష్ణగౌడ్ కొనియాడారు. శుక్రవారం త్యాగరాయ గానసభ నిర్వహణలో కళాసుబ్బారావు కళావేదికలో ప్రముఖ సాహితీవేత్త వేములవాడ భీమకవి జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భీమకవి వేములవాడ రాజరాజేశ్వరస్వామి గుఇరంచి భీమపురాణం పద్య కావ్యం కళా జనార్ధనమూర్తి మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నంచేసిన ప్రబంధ కవులను స్మరించుకునేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నిర్మాత టి.రామసత్యనారాయణ, గాయకుడు రామసుబ్రహ్మణ్యం, సంఘ సేవకులు పీఎస్ఆర్ మూర్తి నర్సయ్య, పాల్గొన్నారు.



అంతర్జాతీయ స్థాయి గణితశాస్త్ర మేధావిగా రాణించిన రామానుజన్

(22 డిసెంబర్ 'జాతీయ గణితశాస్త్ర దినం' సందర్భంగా)

ఆర్యభట్ట, బ్రహ్మగుప్త, సత్యేంద్రనాథ్ బోస్, మహాలనోబిస్, సి యన్ రావు, డి ఆర్ కప్రేకర్, హరీష్ చంద్ర, భాస్కర, నరేంద్ర కర్మార్కర్, నీనా గుప్తా లాంటి ప్రపంచ స్థాయి భారత గణితశాస్త్ర దిగ్గజాల సరసన చేరిన అపర బాల మేధావి మన శ్రీనివాస రామానుజన్ అయ్యర్ అని సగర్వంగా భారతీయులు తలుచుకుంటున్న ప్రత్యేక సందర్భమిది. 22 డిసెంబర్ 1887న తమిళనాడులోని నిరుపేద అయ్యంగార్ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు శ్రీనివాస రామానుజన్ అయ్యర్. 19వ శతాబ్దపు ప్రఖ్యాత గణిత మేధావులు యూలర్, జాకోబిల లాంటి శాస్త్రజ్ఞుల సరసన ప్రపంచ గణిత వేదికలో గణిత వెలుగులు నింపిన బాల మేధావిగా రామానుజన్ అయ్యర్ గణితశాస్త్ర చరిత్రలో సుస్థిర స్థానాన్ని దక్కించుకున్నారు. సంప్రదాయ పాఠశాల విద్య లేనప్పటికీ తన 12వ ఏటనే త్రికోణమితి సిద్ధాంతాలను ప్రతిపాదించిన అత్యంత ప్రతిభగల బాల మేధావిగా మన శ్రీనివాస రామానుజన్ ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. 1904లో పాఠశాల విద్య పూర్తి చేసిన రామానుజన్ ఇతర సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించని కారణంగా కళాశాల విద్యలో ప్రవేశం పొందలేక డిగ్రీ పట్టాకు దూరమైపోయారు.

శ్రీనివాస రామానుజన్ ప్రతిపాదించిన గణిత సిద్ధాంతాలను పరిశీలించిన ఆక్సఫర్డ్ యూనివర్సిటీ ఆచార్యుడు జి హెచ్ హార్డీ చొరవతో 1917లో లండన్ ట్రినిటీ కాలేజీలో చేరి అనంత శ్రేణులకు (ఇన్ఫినిటీ సీరీస్) సంబంధించిన పలు సిద్ధాంతాలను ప్రతిపాదించారు. తన 32 ఏండ్ల స్వల్ప జీవిత కాలంలో 3,900 గణిత సిద్ధాంతాలు, సూత్రాలు, సమీకరణాలను ప్రతిపాదించ గలిగారు. రామానుజన్ అయ్యర్ ప్రతిపాదనల్లో కొన్నింటిని నేటికీ ప్రపంచ గణిత శాస్త్రజ్ఞులు అర్థం చేసుకోలేక పోతున్నారు. రామానుజన్ ప్రతిభను గుర్తించి లండన్ మాథమెటికల్ సొసైటీ, ఫెల్లో ఆఫ్ రాయల్ సొసైటీ లాంటి ప్రతిష్ఠాత్మక సంఘాల్లో సభ్యత్వంతో పాటు డిగ్రీ పట్టాను కూడా పొందారు. చిన్నతనం నుంచే పేదరికం కారణంగా పలు అనారోగ్యాలతో సతమతం అయ్యారు. లండన్ వాతావరణం, జీవనశైలి/ఆహార అలవాట్లు నచ్చకపోవడంతో శ్రీనివాస రామానుజన్ ఆరోగ్య క్షీణించడంతో 1919లో భారత్‌కు తిరిగి వచ్చారు. క్షయ వ్యాధి ముదరడంతో తన 32వ ఏటనే 26 ఏప్రిల్ 1920న తుది శ్వాస విడిచారు.

రామానుజన్ ప్రతిభకు గీటురాళ్లుగా నిలిచిన గణితశాస్త్ర రంగాలలో ముఖ్యమైనవిగా భిన్నాలు, అనంత శ్రేణి, సంఖ్యా సిద్ధాంతం, గణిత విశ్లేషణలు లాంటివి నిలిచాయి. రామానుజన్ టీటా ఫంక్షన్, పార్టిషన్ ఫార్ములా, డైవర్జంట్ సీరీస్, జీటా ఫంక్షనల్ ఈక్వేషన్, రామానుజన్ ప్రైమ్, రీమన్ సీరీస్, ఎలిప్టికల్ ఇంటిగ్రల్స్, హైపర్ జియెమెట్రిక్ సీరీస్, మాక్ టీటా ఫంక్షన్, హార్డీ రామానుజన్ సంఖ్య (1729) లాంటి ప్రతిపాదనలు అనేకం చేశారు. భారతీయుడిగా దేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన రామానుజన్ కృషిని గుర్తించిన ప్రభుత్వం 2012 నుంచి వారి పుట్రిన రోజు 22 డిసెంబర్‌న 'జాతీయ గణితశాస్త్ర దినం' పాటించుట ఆనవాయితీగా మార్చింది. 'నేషనల్ మాథ్స్ డే' వేదికగా పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థల్లో గణితశాస్త్ర ప్రాధాన్యత, శాస్త్ర అవగాహన, గణితం పట్ల భయాన్ని తొలగించి యువతకు ప్రేరణ కల్పించడం లాంటి పలు కార్యక్రమాలు నిర్వహించడం, గణిత మేధావులను సన్మానించడం జరుగుతుంది.

ఆధునిక శాస్త్రసాంకేతిక విప్లవంలో సోషల్, కామర్స్, టెక్నాలజీ, బయో/ఫిజికల్ సైన్స్ రంగాలన్నింటిలో గణితం ఒక ముఖ్యమైన భాగం అయిపోయింది. 'కింగ్ ఆఫ్ ఆల్ సబ్జెక్ట్స్'గా గణితానికి గుర్తింపు ఉంది. నేటి విద్యార్థులు విధిగా గణితాన్ని చదవడం, నైపుణ్యాన్ని సాధించడం కనీస అవసరమైంది. గణితం పట్ల ఆసక్తిని పెంచుకోవడానికి సిద్ధాంతాలను ఆకలింపు చేసుకోవడం, అభ్యాసం చేయడం, భయాన్ని వీడి పట్టుదలతో సాధన చేయడం, సందేహాలను నివృత్తి చేసుకోవడం, తరుచుగా చేసే పొరపాట్లను గుర్తించి సవరించుకోవడం లాంటి పద్ధతులను అవలంభించాలి. 32 ఏండ్ల స్వల్ప జీవితకాలంలో అపార గణిత పరిజ్ఞానాన్ని విశ్వానికి పరిచయం చేసిన "భారత గణిత రత్న"గా శ్రీనివాస రామానుజన్ జీవితం నేటి యువతకు నిత్య ప్రేరణ కావాలి. ఎంత కాలం జీవించామనేది ముఖ్యం కాదని, ఎలా జీవించాం, ఏం చేశామనేదే ప్రధానమని రామానుజన్, వివేకానందుడు లాంటి ఎందరో భారత మేధావులు మనకు మార్గ నిర్దేశనం చేస్తూనే ఉన్నారు, చేస్తూనే ఉంటారు. ఇలాంటి ప్రముఖుల ప్రేరణతో నేటి యువత తమ తమ రంగాల్లో ఆకాశమే హద్దుగా ఎదగాలని ఆశిద్దాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

పొత్తూరి రచన "సుమ సోయగాలు" ఆవిష్కరణ

ప్రకృతిలో పూలకు సాహిత్యంతో విడదీయలేని సంబంధం ఉందని వై.యస్.ఆర్.ఉద్యానవన విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు డా॥టి.జానకిరామ్ పేర్కొన్నారు. సాహితీకిరణం సంపాదకులు, కవి పొత్తూరి సుబ్బారావు పూలగురించి వచన కవితల్లో రాసిన 'సుమసోయగాలు' పుస్తకావిష్కరణ డిసెంబర్ 18 ఆదివారం ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లా కడియం పంచాయితీలోని బుర్రిలంకలోని పి.యస్.యమ్.కన్వెన్షన్‌లో జరిగింది. ప్రముఖ కవి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు చిలుకూరి శ్రీనివాసరావు అధ్యక్షతన పల్లవెంకన్న ఛారిటబుల్ ట్రస్ట్, సాహితీకిరణం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జానకిరామ్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు జ్యోతిప్రకాశనం చేసి, స్వర్గీయ పల్లవెంకన్న చిత్రపటానికి పూలమాలలు వేసి, అతిథులు ఘనంగా నివాళులర్పించారు. 'సుమసోయగాలు' పుస్తకాన్ని స్వర్గీయ పల్లవెంకన్నకు అంకితంకావించారు. రచయిత దంపతులు పొత్తూరి సుబ్బారావు, జయలక్ష్మి చేతులమీదగా వెంకన్న కుమారులు పల్ల సత్తిబాబు, పల్ల సుబ్రహ్మణ్యం, పల్ల గణపతిలు కృతిని స్వీకరించారు.

తెలుగు సాహిత్యంలో కేవలం పూల గురించి వర్ణిస్తూ వాటి రకాలు చెబుతూ వాటి గుణాలు వివరిస్తూ కవిత రూపంలో వచ్చిన రచనలు తక్కువేనని, అందరికీ ఉపయోగంగా ఉన్నాయనీ ఈ పుస్తకాలను ఉద్యానవన యూనివర్శిటీ లైబ్రరీలో ఉంచటంతో పాటు ఉద్యానవన విద్యార్థులందరికీ అందుబాటులో ఉండేలా చేస్తానని జానకిరామ్ అన్నారు. నర్సరీ రంగానికి ఎనలేని కృషి చేసిన స్ఫూర్తి ప్రదాత పల్ల వెంకన్నకి ఈ పుస్తకం అంకితం ఇవ్వటం ఎంతో సముచితంగా ఉందన్నారు. కవి చిలుకూరి మాట్లాడుతూ అందరికీ అర్థమయ్యే సాధారణ భాషలో ఉన్న 'సుమ సోయగాలు' తప్పని చదివితీరాల్సిన పుస్తకం అన్నారు. సాహితీ విమర్శకులు పొత్తూరి సీతారామరాజు పుస్తక సమీక్ష చేశారు. నర్సరీ రైతు కృతి స్వీకర్త పల్ల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తాము నిత్యం ఉత్పత్తి చేసే మొక్కలు, పువ్వులు గురించి కవితల రూపంలో చాటి చెప్పిన సుబ్బారావుగారు అభినందనీయులు అన్నారు. ప్రముఖ సాహితీవేత్త మార్ని జానకిరామ్ చౌదరి మాట్లాడుతూ 'సుమ సోయగాలు' ఈ మధ్య కాలంలో వెలువడిన గొప్ప సాహితీకృతి అన్నారు. ప్రముఖ కవి ఎస్.ఆర్.పృథ్వి పుస్తకాన్ని గురించి మాట్లాడారు. వి.ఎన్.ఆర్.ఎన్.సోమయాజులు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కరిపెద్ది శిరీష సభకు కవిని పరిచయం చేశారు. కవి వి.యస్.వి.ప్రసాద్ అభినందన పత్రాన్ని చదివారు. సభలో రచయిత జాలా నటరాజు, సర్ ఆర్థర్ నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు పుల్లా చంటి, మాజీ అధ్యక్షులు పుల్ల ఆంజనేయులు, పాలంశెట్టి శ్రీనివాస చక్రవర్తి, కడియపులంక సహకార బ్యాంకు అధ్యక్షులు తిరుమలశెట్టి శ్రీనివాసరావు, నర్సరీ రంగ ప్రతినిధులు మార్గాని సత్యనారాయణ, పుల్లారామారావు తదితరులు సభలో ప్రసంగించారు.

ఈనెల 19న డా॥ కేతవరపు రాజ్యశ్రీ రచించిన 'మార్నింగ్ ... ఆంగ్లానువాదం పుస్తకాన్ని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యా... వైస్ చాన్సలర్‌శ్రీ తంగెడు కిషన్ రావు ముఖ్యఅతిథిగా ... ఆవిష్కరించారు. సభకు ముక్తేవి భారతి అధ్యక్షత వహించారు ... వాణి స్టూడియో డైరెక్టర్, అయినంపూడి శ్రీలక్ష్మి విశిష్ట అతిథిగా , ... అతిథిగా శ్రీమతి కృష్ణవేణి, పుస్తక రచయిత్రి డాక్టర్ కేతవరపు రా... ఇంగ్లీషు అనువాదకురాలు శ్రీమతి స్వాతి శ్రీపాద వేదికనలంకరిం...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 704వ రోజు 'నాయకత్వం' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'నాయకత్వం' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

రౌతు

రౌతు కొద్దీ గుర్రం!
కళ్ళెం చెర్నాకోల్ అదుపులో
సమయానికి తగు మాటలు చేతలతో
గరంగరం గుస్సా
మెత్త మెత్తగా
చివాట్ల అట్లు వడ్డింపు.
చాకచక్యం గ్రహింపు
సామదాన
భేద దండోపాయాల ప్రయోగం
సహనం ఓర్పు తీర్పు తో
వెలుగు బాటపై నడిపే సత్తా
కలేజా లేకుంటే అంతా గోల్మాల్
నెత్తినెక్కి నిక్కి నిక్కి చూసే
గుంటనక్కల తో పారా హుషార్!.
నాటి పంచతంత్రం!
నేటి ప్రపంచ పోకడలు చెప్పేదిదే!
శివాజీ నాయకత్వం
యుద్ధతంత్రం ఆదర్శం!.
బాకాఊదే
బాజాభజంత్రీలకు
దూరం దూరం!
నీతిధర్మం న్యాయం
మాట్లాడేవాడికే కొట్టాలిసలాం!.
పులిని పాముని నిలువరించే సత్తా
అమాయక దీనులకి
చేయూత ఇచ్చే
తనతో నడిపించే సత్తా
ఉన్న నాయకుడు
అందుకుంటాడు జేజేలు!.

-ఎ.రాజ్యశ్రీ

నాయకుడు

సమాజ హితం లక్ష్యం
నలుగురితో సఖ్యత
నాయకత్వం ఒక కళ
నాయకుడ్ని చూస్తే భరోసా
నమ్మకానికి మరోపేరు.
నాయకత్వం అంటే
అహం అసూయకాదు
ఆధిపత్యం అధికారం
అసలేకాదు
నేను కాదు
మనం అనే భావనతో
సాగి పోవటమే నాయకత్వం
నాయకత్వం
మనం చెప్పుకోకూడదు
జనం చెప్పుకోవాలి
వాళ్ళు ఒప్పుకోవాలి
మార్పు కోసం పాటు బడుతూ
కొత్తబాట
వెయ్యగలవాడే నాయకుడు
తెలివి తెగువ
సమయస్ఫూర్తి తో
పదిమందిని తన తో
తిప్పుకోగలగటమే
నాయకత్వం
సమస్య అవగాహన
అనుభవం ఓర్పుల
సమాహారమే నాయకుడు
వాటి నిరంతర
అభ్యాసమే నాయకత్వం.

-మోటూరి శాంతకుమారి

మార్గదర్శి

ఇంట నాన్న
నాయకుడు
బడిలో గురువు
దేవుడు
ప్రార్థన చేసే పరమాత్ముడు
అడుగడుగునా దారి చూపు వారే!.
బతుకు బాట బంగారు బాట
కావలెనన్న గతుకులను తప్పించి
నడిపించు నాన్న!.
జీవితాలు బాగుపడవలె నన్న
మంచి నాయకుడు కావాలి చక్కగా
ముమ్ముందుకు సాగేందుకు!.
తెగువ లేక
తెలివి లేక
ముందుకు సాగలేం
తనను మరిచి
ఇతరులకై పాటుపడే
సోనుసూద్ లాంటివారు
నూటికి ఒక్కరు ఉండినా
బంగారు భవితవ్యం సాధ్యం!!.
నాయకుడంటే
దేశాన్ని కొల్లగొట్టే
దుష్ట చరితలు కాదు
నేనే దేశం అన్న భావన కావాలి
పదిమందికై నా బతుకు
అందరూ బాగుంటే
నాకు పంటలు పండు
నేను కాదు-మేమందరం
మన మందరం దేశం కోసం
అనగలిగిన మహానుభావుడే
మంచి నాయకుడు,,!!!.

- కె.కె.తాయారు

నాయకత్వ లక్షణం

స్వచ్ఛందంగా చేసే పనిని
సంపూర్ణ ఏకాగ్రతతో
నిజాయితీగా చేస్తూ
తన శ్రేయస్సు కోసమే కాక
ఇతరుల మంచి కోసం
ప్రయత్నం చేస్తారో
వారే నిజమైన నాయకులు
అదే నిజమైన నాయకత్వ లక్షణం!!
అజమాయిషీ చెలాయించడం
నాయకత్వ లక్షణం కాదు
అధికారం
సహజసిద్ధం
నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండడం
దృఢ నిశ్చయంతో ముందుకు కదలడం
నాయకత్వ లక్షణం !!
ఎంత క్లిష్టమైన పనులనైనా
చేయడానికి వెనుకాడక
విజయం సాధించగలనని నమ్మకంతో
నియమబద్ధుడై బాధ్యతకు కట్టుబడి
విలువలతో జీవితాన్ని గడుపుతాడో
అతడే నిజమైన నాయకుడు!!.
తనది కాని సొమ్మును ఆశించక
స్వార్థానికి అతీతంగా
తన బలహీనతలను జయిస్తూ
తన జీవిత లక్ష్యాలను సాధించి
నూతన విధానాలను
సమాజానికి పరిచయం చేసే
ప్రతి వ్యక్తి నాయకత్వం గల
నిజమైన నాయకుడే!!.
భావిభారత పౌరులందరూ
నాయకులుగా జీవిస్తూ
నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటూ
దేశ సమస్యలను
తమ సమస్యలుగా భావించి
నిరంతరం వాటి పరిష్కార
దిశగా ఆలోచిస్తారో
వారే నిజమైన నాయకులు
అదే అసలైన
నాయకత్వ లక్షణం!!.

- విజయలక్ష్మి వడ్డేపల్లి

ప్రజా పాలన

దేశ భవిష్యత్తు
నాయకుల పాలనపై ఆధారం
దేశ భవిష్యత్తుకు ప్రగతి మూలం.
జాతి ఉన్నతి
ప్రతిభ
దేశ ప్రగతి
నాయకుల
బుద్ధిబలం పైనే ఆధారం.
ప్రజా రక్షణ కోరే నాయకుల
పరిపాలన దక్షత వల్లే ప్రగతి
ఏ సంస్థ అయినా
దేశమైనా
నాయకుల
సమిష్టి ఆలోచనపై పాలన.
నాయకులు
అందరికీ న్యాయం చేస్తూ
ముందుకు సాగుతూ
పదవి కోసమే కాకుండా
ప్రజలకోసం పరి పాలిస్తే
సాధ్యం దేశ ప్రగతి.

-నారుమంచి వాణీప్రభాకరి



బొమ్మ - బొరుసు

నాయకత్వం
ముళ్ల కిరీటమని ఎరిగినా
అడుగు ముందుకేస్తారు
కొందరు చిరు నవ్వుతో
జన హితం తమ
అభిమతమని ఎంచి
నిస్వార్థ సేవతో నిలుస్తారు
ప్రజల హృదయాలలో
తెల్ల ఖద్దరు తొడుగులో
కొన్ని అరాచక శక్తులు
దర్జాగా తిరుగుతాయి
నాయకత్వం ముసుగులో
ప్రజల జీవితాలు
దోచుకు తింటాయి చల్లగా
మట్టి అంటని చేతులతో
కుయుక్తుల బుర్రలతో
తస్మాత్ జాగ్రత్త !
బొమ్మేదో..
బొరుసేదో..
విజ్ఞతతో తెలుసుకో.

- రామకృష్ణ చంద్రమౌళి

దారి దీపం

అందరికన్నా ముందు నడిచేవాడు
నలుగురికి దారి దీపమై నిలిచేవాడు
అందరి కష్టం తన కష్టంలా భావించేవాడు
సమాజ అభ్యున్నతిని
సదా కాంక్షించేవాడు!!.
తన జాతి జనులను
ఉద్ధరించడానికి
కంకణం కట్టుకున్నవాడు
ఎవరికి కష్టమొచ్చినా
నేనున్నానంటూ
ముందుండే వాడు!!.
త్యాగాలకు వెరవని వాడు
ప్రజల కోసం
ప్రాణాలు సైతం పణం పెట్టేవాడు
ఇరువది నాలుగు గంటలు
ప్రజలకు అందుబాటులో ఉండేవాడు
అసలు సిసలు నాయకుడు
ఇవీ నాయకత్వ లక్షణాలు!!.

-పరిమి వెంకట సత్యమూర్తి

ఆదర్శ అధినేత

అహంభావంతో మిడిసిపడక
పెత్తనంతో పీడించక
అందరినీ కలుపుకుని వెళ్ళేవాడు
అందరి కోసం ఒక్కడై నిలిచేవాడు!.
అనుచరుల నడుమ
విభేదాలను తొలగించి
అందరి వాదనలను
సూచనలను చెవినబెట్టి
అందరికీ
ఆమోదయోగ్యమైన
నిర్ణయం తీసుకొనేవాడు!.
వ్యక్తిత్వంలో
నైతిక విలువలు పాటించే
విషయంలో
అందరికీ ఆదర్శంగా ఉండేవాడు!.
సమస్యలు తలెత్తినప్పుడు
ముందు నిలిచేవాడు
ఆపదలు చుట్టుముట్టినప్పుడు
వెన్నుదన్నుగ ఉండేవాడు!
తన వాగ్ధాటితో
ముగ్ధులను చేస్తూ
అందరినీ
క్రమశిక్షణలో ఉంచగలవాడు
భిన్న స్వభావాల వ్యక్తులను
ఒక్కతాటిపై నడిపేవాడు!.
సమయస్ఫూర్తి మేళవించి
సమయానికి
తగు సరైన నిర్ణయం
తీసుకోగలిగినవాడు
చాకచక్యంతో
జనులను ఆకర్షించగలిగేవాడు!
శౌర్య ధైర్యాలే కాదు
మంచితనంతో
మానవత్వంతో మెలిగేవాడే
ఆదర్శ అధినేత!!!.

- చంద్రకళ దీకొండ

దేశ సేవే మాధవ సేవ

దేవుడికి పూజలు చేస్తూ
కోరికలు కోరుతాం
నాయకుడు
ప్రజల అవసరాల్ని తీర్చే
దేవుడు కావాలి
దేశ సేవే మాధవ సేవ కావాలి
చరిత్రలో
నిలిచిపోయే నాయకత్వం రావాలి
నాటి నాయకత్వం
దేశం కోసం సర్వం త్యాగం
నేడు
చెదలు పట్టిన నాయకత్వం
దిగజారుడు నాయకులు
దేశానికి
దినదిన గండం నేటి నాయకత్వం
అధికారం కోసం దేశ ప్రజల
సర్వస్వాన్ని అమ్మకం
పదవులే ప్రాణంగా నమ్మే
నాయకులు కాదు
ప్రజలకు భరోసా
కొండంత అండదండగా
నిలిచే నిజమైన నాయకుడు కావాలి
నోటుకు ఓటును అమ్ముకున్నంత
కాలం
ప్రజలు అమ్ముడుపోయినంత కాలం
మేధావులు మౌనం
వహించినంత కాలం
ధర్మానికి నిలవాల్సిన వ్యవస్థలు
అధికారానికి తొత్తులుగా
సలాం చేస్తున్నంత కాలం
మనలో మనం విభేదించుకుంటూ
మానవత్వానికి మాయని మచ్చల్ని
మిగులస్తూ
రకరకాల మత్తుల్లో తేలుతున్నంత కాలం
మనం కలలు కనే నాయకత్వం రాదు
వ్యవస్థ ప్రక్షాళన జరగాలంటే
మనం మారుదాం
గొర్రె దాటుడు నాయకత్వం కాదు
గుర్రాల్లా పరుగెత్తే శక్తి రావాలి.

-లోడె రాములు

నైపుణ్యం

పని అందరూ కలసి చేసినా
పని చేయించే నాయకుడుంటడు
లక్ష మంది మీటింగులోనైనా
ఒక్కరిద్దరు పెద్దలీడర్లతో
మరో నలుగురు చిన్న లీడర్లు
యుద్ధంలో
ముందుండి నడిపించే నాయకత్వం
దృఢంగా లేకపోతే
సైనికులూ బలహీనం
రాజకీయపార్టీ ఎన్నికల్లో గెలవాలంటే
ఆకర్షించే పథకాల హామీలపై
అలవోకగా మాట్లాడి
ఓటేసేందుకు ఒప్పించే
నాయకత్వానిదే సిసలైన విజయం
నీతి నిజాయితీలున్న నాయకత్వానికి
క్రమంగా బీటలు పడుతుంది
"మనీ మేక్ మెనీ థింగ్స్" లాగా
ఈరోజు ఒకపార్టీలోని నాయకత్వం
రేపు ఏ పార్టీతో దోస్తానానో తెలియదు
ప్రతిపనిలో
అందరూ ఒకే నైపుణ్యం కలిగి ఉండరు
ఎక్కువ
నైపుణ్యమున్నవాడికే నాయకత్వం
అందరూ అంగీకరించే
సర్వ సాధారణ వాస్తవం
ప్రలోభాలకు లొంగని
ప్రజాపక్షపాత నాయకత్వమే
ప్రజల అవసరాలను గుర్తించి
తీరుస్తుంది.

-నాగిరెడ్డి అరుణ జ్యోతి

సందేశ కావ్యాలకు కాళిదాసే ఆద్యుడు

-"అమరావతి సాహితీమిత్రులు" సభలో ప్రముఖ సాహితీవేత్త డా॥ డి.ఎన్.దీక్షిత్



సందేశ కావ్యాలకు కాళిదాసు ఆద్యుడని ప్రముఖ సాహితీవేత్త డా. దీవి నరసింహ దీక్షిత్ తెలిపారు. గుంటూరు అమరావతి సాహితీమి త్రులు ఆదివారం ఉదయం సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ భవనంలో నిర్వహించిన సాహిత్య కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. డా. సూర్యదేవర రవి కుమార్ రచించిన "మేఘ సందేశం... గేయానువాదం" గ్రంథాన్ని ఆవిష్కరించి ఆయన ప్రసంగిస్తూ మేఘ సందేశ కావ్య విశిష్టత వివరించారు. అనుభూతికి, రసానుభూతికి మేఘ సందేశం పెద్ద పీట వేసిందని చెప్పారు. కాళిదాసు కృతికి సరళ సుందర శైలిలో గీయానువాదం చేయడం వల్ల జన సామాన్యానికి కూడా కాళిదాసు కవిత్వ ఘనత తెలుస్తుందని సూర్యదేవరను ప్రశంసించారు. ప్రముఖ కవి పండితులు డా. వుయ్యూరు లక్ష్మీ నరసింహారావు గ్రంథాన్ని సమీక్షిస్తూ ప్రాచీన సంస్కృత, ఆంధ్ర సాహిత్య పరిచయం విరివిగా ఉన్న సూర్యదేవర చక్కని తెలుగు నుడికారంతో అనువాదం నడిపించారని విశ్లేషిం చారు. సూర్యదేవర రాసిన "మృత్యుం జయ" మరో గ్రంథం పద్య కవితల సంపుటిని ప్రముఖ సంస్కృత సాహితీవేత్త సుఖవాసి మల్లికార్జునరాయ శాస్త్రి ఆవిష్కరించి ప్రసంగిస్తూ సంప్రదాయం మూర్తీభవించిన అంశాలతో అత్యంత ఆదునికత ఉన్న అంశాల మీద కూడా చక్కని చిక్కని పద్య కవి త్వం వెలయించారని అభినం దించారు. అమరావతి సాహితీ మిత్రు లు సంస్థ అధ్యక్షులు డా. రావి రంగారావు అధ్యక్షత వహించిన సభలో " ఈ మాసం కవి' 'గా సంధుపట్ల భూపతి (మంగళగిరి) పాల్గొని వివిధ సామాజిక రుగ్మతల మీద వినిపించిన కవితలు సభను చక్కగా ఆకట్టుకున్నా యి. సంస్థ పక్షాన డా. రావి రంగా రావు, చంద్రయ్య భూపతిని, సూర్యదేవర రవికుమార్ ను ఘనంగా సత్కరించారు. సభలో పాల్గొన్న అతిథుల్ని డా. సూర్యదేవర రవికుమార్ శాలువాలతో సన్మానించారు. ప్రముఖ సాహితీవేత్త మైలవరపు లలి తకుమారి నిర్వహించిన కవి సమ్మే ళనం కార్యక్రమంలో పేక్ కాసింబీ, ఇ. చంద్రయ్య, యక్కంటి పద్మావతి, కొణతం నాగేశ్వరరావు, మన్నం వెంకట గురువు, సిద్దాబత్తిని రమాదేవి, రావినూతల కమలకు మారి, గోలి హనుమచ్చాస్త్రి, గోలి మధు మొదలైనవారు పాల్గొన్నారు.

నీ సన్నిధానం

నీటి మీద రాతలా వుండ నివ్వని - నిర్మలతనం - నీ సన్నిధానం
నీతి నియమాలను పాటించే - నిఖ్ఖచ్చితనం - నీ సన్నిధానం
నీడలా వుంటూ - నిందలు మోప నివ్వని - నిందుదనం - నీ సన్నిధానం
నీళ్ళు కలపని పాలలా వుండే - నిశ్చలతనం - నీ సన్నిధానం.

ఎక్కడ వున్నా - ధ్యాస - శ్వాసలను పంచే ఆత్మీయ తపోవనం - నీ సన్నిధానం
నీరు కారే విధంగా మాట్లాడ నివ్వని - నిరుపమానం - నీ సన్నిధానం
నీ వెన్నంటే వుంటూ-వెన్న పోటు పొడవ నివ్వని-నిర్వచనం-నీ సన్నిధానం
నీ వుంటే వేరే కనులెందుకులా కొలిచే - సుమనస్సు సమ్మోహనం-నీ సన్నిధానం

నీరజం లా అలరించే - నందనం - నీ సన్నిధానం
నీకంటే వేరే బ్రతుకెందుకులా అలరించే - వేణుగానం - నీ సన్నిధానం
నీ మనిషినే - నేనంటూ-నామోషి పరచనివ్వని-మనీషి సుమనం-నీ సన్నిధానం
నీ కనుచూపు-నీడలోనే-బ్రతుకు తరించాలనే-కమనీయ-నయనం-నీ సన్నిధానం

నీ అలికిడి వింటేనే-కష్టాలు తొలిగేలా చేసే అనిర్వచనీయ శుభ శకునం-నీ సన్నిధానం
నీ చేయి తాకితేనే-మనసుకు హాయి కలిగించే-అమూల్యమైన-సదనం-నీ సన్నిధానం
నీకు చెప్పకుండగా-ఏమీ చేయాలనిపించని-అనన్య-వదనం-నీ సన్నిధానం
నీకు నేనున్నానుగా - ణశీఖ్ఖ్ష్ణశీతీతీఎ అని అక్కున చేర్చుకుని
పూవై విరిసిన - పున్నమి వేళలా అలరించే
పారవశ్య-గంగా ప్రవాహ-స్నేహరేఖల-లాలనం-నీ సన్నిధానం

-లంకా వెంకట సుబ్రహ్మణ్యం
సెల్: 94404 48650



'చిత్సుధ' ఆవిష్కరణ

చిక్కడపల్లిలో చిత్సుధ వ్యాస సంపుటిని వివేకానంద సేవా సమితి చైర్మన్, ఆధ్యాత్మికవేత్త సీహెచ్ హనుమంతరావు ఆదివారం ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత సిలువేరు సుదర్శన్ దానిని రచించారు. భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ సాధన సాహితీ స్రవంతి నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగర ప్రముఖులు అశ్వినీ స్రవంతి నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగర ప్రముఖులు అశ్వినీ సుబ్బారావు అధ్యక్షత వహించారు. చారిత్రక నవలాచక్రవర్తి, ఆచార్య ముదిగొండ శివప్రసాద్‌కు అంకితం చేసిన పుస్తకాన్ని అడవి సూర్యకుమారి గొడవర్తి సంధ్య సమీక్షించారు. సాధన నరసింహాచార్య శంభునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రచయితల సంఘం

ఆహ్వానం

24.12.2022 శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం మొదటి అంతస్తు హాలు, బాగ్ లింగంపల్లి, హైదరాబాదు.

తెలుగుభాష - ఆధిపత్యాలు

సదస్సు

ఆహ్వానం : కందుకూరి శ్రీరాములు
తెరసం జంట నగరాల శాఖాధ్యక్షులు

అధ్యక్షత : డా. నాళేశ్వరం శంకరం
తెరసం రాష్ట్ర అధ్యక్షులు

ప్రస్తావన : డా. వి. శంకర్
తెరసం రాష్ట్రప్రధాన కార్యదర్శి

ప్రసంగాలు :
1. తెలుగుభాష-సాహిత్య ప్రభావం
ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
ప్రముఖ సాహిత్య విమర్శకులు
2. తెలుగు-వివిధ భాషలు-ఆధిపత్యాలు
డా. నలిమెల భాస్కర్
ప్రముఖ భాషావేత్త
3. తెలుగుభాష-ప్రసార మాధ్యమాలు-ప్రభావాలు
డా. కె. శ్రీనివాస్
సంపాదకులు, ఆంధ్రజ్యోతి
4. భాషాధిపత్యాలు-ఉద్యమాలు-తెలుగు
డా. నందిని సిధారెడ్డి
ప్రముఖ క